ప్రజాశక్తి

గురువారం 22 మే 2025 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా

ఇది కోనేరు కాదు... బందరులోని ఓ రోడ్డు

ముంచెత్తిన వర్షం

• డ్రైనేజీలు అస్తవ్యస్తం • రోడ్లపై నిలిచిన నీరు

ప్రజాశక్తి-విజయవాడ, మచిలీపట్నం అర్బన్

ఉపరితల ఆవర్తనం ద్రోణి ప్రభావంతో బుధవారం విజయవాడ, బందరు నగరాల్లో వర్షం ముంచెత్తింది. విజయవాడలో రాత్రి ఏడు గంటల సమయంలో ప్రారంభమైన వర్షం 8.30 గంటల వరకు కురుస్తూనే ఉంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కూడా ఎండ ప్రభావం అంతగా కనిపించలేదు. సాయంత్రం వాతావరణం చల్లబడటం, రాత్రికి వర్షం కురవడంతో నగర వాసులు తీవ్రమైన ఎండలకు ఉపశమనం పొందారు. ఈ వర్షం ప్రభావం బుధవారం రాత్రి, గురువారాల్లో కూడా ఉండవచ్చనని వాతావరణ శాఖ అధికారులు తెలుపుతున్నారు. అయితే నగరంలో కురిసిన వర్షానికి సరైన డ్రైయినేజి వ్యవస్థ లేక వర్షపు నీరు రహదారులపై నిలబడిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ పరిస్థితి వర్షం కురిసిన ప్రతి సారి నగర ప్రజలకు ఎదురవుతూనే ఉంది. ప్రజాప్రతినిధులు, విఎంసి అధికారుల ప్రకటనలే తప్ప మెరుగైన డ్రైయినేజి వ్యవస్థ కోసం జరిగిన వర్క్స్ చేయించిన దాఖలాలు లేనే లేవని ప్రస్తుతం కురిసిన వర్షం...రహదారులపై, లోతట్టు ప్రాంతాల్లో నిలిచిపోయిన వర్షపు నీటి దృశ్యాలే విధితం చేస్తున్నాయి. డ్రైనేజీల్లో షిల్టు కూడా పూర్తి స్థాయిలో తొలగించే పనులు నత్తనడకన జరుగుతుండటం, ప్రధానంగా స్ట్రామ్ వాటర్ డ్రైయినేజి వ్యవస్త పునర్నిర్మాణ పనులు ప్రజాప్రతినిధుల ప్రకటనలకే పరిమితం కావడంతో వర్షం కురిసిన ప్రతి సారి నగర వాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధానంగా పిఎన్ బస్‌స్టేషన్ సమీప రైల్వే అండర్ బ్రిడ్జీ, వన్‌టౌన్ కాళేశ్వరరావు మార్కెట్ సమీప రైల్వే అండర్ బ్రిడ్జీ కింద వర్షపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఆయా ప్రధాన సెంటర్లలో కూడా వర్షపునీరు పెద్ద ఎత్తున రహదారులపై నిలిచిపోయింది. తూర్పు సిటీలోని ఫాలీక్లినిక్ రోడ్డు, కృష్ణలంక, రాణిగారితోట, పటమట రైతు బజార్, ఆటోనగర్, ఆయప్పనగర్, సూర్యారావుపేట, హనుమాన్‌పేట, గవర్నర్‌పేట, రూట్ నెంబర్ ఫైవ్, బిగ్‌బజార్, మ్యూజియం రోడ్డు, చిట్టినగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, విజయా పాలడైరీ, పూర్ణానందంపేట, మ్యాంగో మార్కెట్, సత్యనారాయణపురం తదితర ప్రాంతాల్లో డ్రైయినేజి నీరు, వర్షపునీరు ఏకమై రహదారులపై నీరు పెద్ద ఎత్తున ప్రవహించింది. మోటార్లు ద్వారా లో-లెవల్ ఏరియాలో నీటి తొలగింపు పనులు విఎంసి అధికారులు చేపట్టినా పూర్తిస్థాయిలో జరగలేదని ప్రజలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. అధికారుల (మిగతా 2లో)

25న సివిల్స్ ప్రిలిమ్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

• 10,381 మంది అభ్యర్థులు • 25 పరీక్షా కేంద్రాలు
• ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ

మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఈ నెల 25న దేశవ్యాప్తంగా సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షను నిర్వహించనున్న నేపథ్యంలో పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో యూపీఎస్సీ ప్రిలిమ్స్ నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. సివిల్స్ ప్రిలిమ్స్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మార్గనిర్దేశనం చేశారు. ఎన్‌టిఆర్ జిల్లాలో 25 కేంద్రాల్లో 10,381 మంది అభ్యర్థులు పరీక్ష రాసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఆదివారం ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్ష జరగనుందన్నారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి లోకల్ ఇన్‌స్పెక్టింగ్ కమ్ లైజన్ ఆఫీసర్, రూట్ అధికారులు, సూపర్‌వైజర్లు, స్ట్రాంగ్ రూమ్ భద్రతా సిబ్బంది తదితరులను నియమించినట్లు వెల్లడించారు. రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్యం, విద్యుత్, ఏపీఎస్ఆర్‌టీసీ, మునిసిపల్ తదితర శాఖల అధికారుల సమన్వయంతో పరీక్షను విజయవంతంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, నందిగామ ఆర్‌డీవో కె.బాలకష్ణ, తిరువూరు ఆర్‌డీవో కె.మాధురి, కలెక్టరేట్ కోఆర్డినేషన్ విభాగం సూపరింటెండెంట్ సలీమ్, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని పాల్గొన్నారు.

మంగినపూడి బీచ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

5 నుంచి మసుల ఫెస్ట్

శాప్ చైర్మన్ రవినాయుడు ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశకి- మచిలీపట్నం రూరల్

వచ్చే నెల 5వ తేదీ నుండి 8వ తేదీ వరకు జరగనున్న మసుల ఫెస్ట్‌లో భాగంగా జల క్రీడలు, బీచ్ కబడ్డీ, బీచ్ వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ రవినాయుడు పేర్కొన్నారు. బుధవారం మచిలీపట్నం మంగినపూడి బీచ్‌ను సంబంధిత అధికారులతో శాప్ చైర్మన్ కలిసి సందర్శించారు. అక్కడ జరుగుతున్న స్వాగత తోరణం ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం సముద్రతీరం వెంబడి పర్యటించి జల క్రీడలు నిర్వహించే ప్రదేశం పరిశీలించి, క్రీడలు జరిగే సమయంలో దాదాపు ఎనిమిది వేల మంది వీక్షించేందుకు వీలుగా తగిన గ్యాలరీలు, విద్యుత్ దీపాలు, సౌండ్ సిస్టం, రక్షణ వలయాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగినపూడి బీచ్ ఉత్సవాలను వచ్చే 5వ తేదీన పెద్ద ఎత్తున ప్రారంభించేందుకు మంత్రి సన్నాహాలు చేస్తున్నారన్నారు. తద్వారా మచిలీపట్నంను మంచి పర్యాటక సాంస్కృతిక ఆధ్యాత్మిక క్రీడా పరంగా అన్ని విధాలా అభివృద్ధి చేయాలని మంత్రి ఆలోచిస్తున్నారన్నారు. దేశంలోనే ఉత్తమమైన బీచ్ ఉత్సవాలుగా నిర్వహించేందుకు ఒక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. ఈ ఉత్సవాలకు మసుల ఫెస్ట్-25గా నామకరణం చేశారని త్వరలో డాల్ఫిన్ లోగోను ఆవిష్కరిస్తామని చెప్పారు. మత్స్యకారులకు గుర్తుగా ఈ చిహ్నాన్ని మలిచారన్నారు. అమరావతికి ముఖద్వారంగా నిర్మిస్తున్న శాశ్వత తోరణం ఆకృతి బాగుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా చారిత్రాత్మక తోరణం రూపుదిద్దుకోవడం (మిగతా 2లో)

జగన్‌ను కలిసిన తిరువూరు వైసిపి కౌన్సిలర్లు

జగన్‌తో తిరువూరు వైసిపి కౌన్సిలర్లు

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు నగర పంచాయతీ చైర్మన్ ఎన్నిక పక్రియను జరగనీయకుండా తమపై టీడీపీ నాయకులు దాడి, దౌర్జన్యం చేసి ఓటుకు తమను రానివ్వకుండా అడ్డుకున్నారని వైసిపి కౌన్సిలర్లు జగన్‌కు ముందు అవేదన వ్యక్తం చేశారు. చైర్మన్ ఎన్నిక విషయంలో సోమ, మంగళవారాల్లో చోటు చేసుకున్న పరిణామాలను వైసిపి తిరువూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నల్లగట్ల స్వామిదాస్ తదితర నాయకులతో కలిసి 11 మంది కౌన్సిలర్లు బుధవారం తాడేపల్లి వెళ్లి జగన్‌ను కలిశారు. పోలీసులు, కూటమి నేతలు, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించి తమను చైర్మన్ ఎన్నికలో పాల్గొనకుండా చేశారని చెప్పారు. తిరువూరులో టిడిపి చేసిన అరాచకాలు అన్నీ వైసిపి నేతలు చెప్పారని, సంయమనం పాటించి ధైర్యంగా నిలబడాలని వైసిపి కౌన్సిలర్లకు జగన్ సూచించారు. జగన్‌ను కలిసిన వారిలో వైసిపి మండల అధ్యక్షులు చలమాల సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, జడ్పీటీసీ రామచంద్రారెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ ఎన్.సుధారాణి, యాదవ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కాలసాని విజయలక్ష్మి, నాయకులు కలకొండ రవికుమార్, కె.నాగేశ్వరరావు, సిహెచ్.లక్ష్మినారాయణ, అర్.ప్రసాద్ ఉన్నారు.

సుసంపన్న ఆరోగ్యాంధ్ర లక్ష్యంగా యోగాంధ్ర

రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు

వార్త 2లో

విజయవాడలో జరిగిన యోగా దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, కలెక్టర్ లక్ష్మీశ, విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర

సుసంపన్న ఆరోగ్యాంధ్ర లక్ష్యంగా యోగాంధ్ర

- ఆనందమయ జీవితానికి ప్రతిఒక్కరూ యోగాకు చేరువకావాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు

ప్రజాశక్తి-విజయవాడ

సుసంపన్న, ఆరోగ్య, ఆనందమయ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా జూన్ 21 వరకు యోగాంధ్ర పేరుతో ప్రత్యేక ప్రచార, జనజాగృతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు తెలిపారు. బుధవారం కృష్ణానదీ తీరాన హరిత బెరం పార్కులో ఎన్‌టిఆర్ జిల్లా అధికార యంత్రాంగం, విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో యోగాంధ్ర మాసోత్సవాలను ప్రారంభించారు. ఇందులో వివిధ శాఖల అధికారులు, యోగా ఔత్సాహికులు, ప్రజాప్రతినిధులతో పాటు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, ఆయుష్ డైరెక్టర్ కె.దినేష్ కుమార్, విజయవాడ మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ యోగా ప్రయోజనాలపై అవగాహన పెంపొందించుకుని, జీవితాంతం ప్రజలు తమ జీవన మార్గంలో యోగాను భాగం చేసుకునేలా ప్రోత్సహించేందుకు నెల రోజుల పాటు ఊరూవాడా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దాదాపు రెండు కోట్ల మంది ఈ కార్యక్రమాల్లో భాగస్వాములను చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. నిపుణులు రూపొందించిన 45 నిమిషాల నిడివితో ఉన్న కామన్ యోగా ప్రోటోకాల్ ఆధారంగా ఔత్సాహికులకు శిక్షణ ఇవ్వనున్నామని, వారికి సర్టిఫికెట్లు అందజేయనున్నామని చెప్పారు. రిజిస్ట్రేషన్‌కు వీలుగా ప్రత్యేక యాప్‌ను రూపొందించడం జరిగిందని, పోర్టల్ కూడా అందుబాటులో ఉంటుందన్నారు. ప్రతి జిల్లాలో కనీసం నాలుగు పర్యాటక ప్రాంతాల్లో రాష్ట్రం మొత్తం మీద దాదాపు వంద పర్యాటక ప్రాంతాల్లో యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ నెల రోజుల యోగాంధ్ర కార్యాచరణలో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాలతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ తమ రోజువారీ జీవితంలో కొంత సమయాన్ని యోగాకు కేటాయించడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయన్నారు. ఆయుష్ డైరెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుడూ యోగాతో ఒత్తిడిని దూరం చేసుకుని ఆనందమయ జీవితాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, జిల్లా ఆయుష్ శాఖ అధికారి డా. రామత్లేహి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి-విజయవాడ: అగ్ని ప్రమాద నిరోధక అవగాహన కార్యక్రమం నిర్వహించిన వియంసి ఫైర్ ఆఫీసర్స్‌విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు అగ్ని ప్రమాదాలను నిరోధించడానికి బుధవారం ఉదయం ఆకస్మిక తనిఖీ చేసారు వి యం సి సిబ్బంది.ఈ కార్యక్రమంలో అగ్ని ప్రమాదం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన నిరోధక చర్యలు, అగ్ని ప్రమాద నిరోధక పరికరాలను ఉపయోగించు విధానము, అగ్ని ప్రమాదం జరిగినప్పుడు మంటలను ఎలా అర్పాలి, ఎటువంటి పరికరాలను ఉపయోగించాలి, ఫైర్ స్ప్రింక్లర్స్, స్మోక్ డిటెక్టర్స్, ఎక్కడెక్కడ అమర్చాలి, వాటి వలన స్మోక్ అలారం ఎలా వస్తుంది, అగ్ని ప్రమాదం జరగకుండా కాంప్లెక్స్ చుట్టూ ఫైర్ సేఫ్టీ మెజర్స్ ఏమేం ఉండాలి వంటి విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, రీజినల్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, స్టేషన్ ఆఫీసర్ రాజా పాల్గొన్నారు.

పశువుల దాణా పంపిణీ

ప్రజాశక్తి-మొవ్వ (కృత్తివెన్ను): కొమళ్లపూడి గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పాడి రైతులకు రాయితీపై పశువుల దాణాను ఎంఎల్ఎ కాగిత కృష్ణప్రసాద్ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పశువులను పెంచే రైతులందరికీ 1110 విలువైన దాణా బస్తాలను 50 శాతం రాయితీతో 555 రూపాయలకు అందజేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మొదటిపేజీ తరువాయి

ముంచెత్తిన వర్షం

ప్రకటనలతో సరిపుచ్చుతున్నారనే విమర్శ లేకపోలేదు. రోహిణీ కార్తె రాబోయే ముందుగా కురుస్తున్న ఈ వర్షాల వలన ఎండల తీవ్రత నుంచి కొంత ఉపశమనం పొందుతున్నా..సగటు రోజువారీ పనులపై ఆధారపడి జీవించే కష్టజీవులు, చిరు వ్యాపారులపై తీవ్రమైన ప్రభావం చూపుతున్నాయి.ముఖ్యంగా బీసెంట్ రోడ్డు, మ్యూజియం రోడ్డు, కలెక్టర్ కార్యాలయం సమీపంలో, ఇతర ప్రాంతాల్లో తట్టల్లో, బుట్టల్లో, బండ్లమీద పండ్లు, ఇతర సరుకులు విక్రయించుకునే పరిస్థితి ఈ వర్షాల వలన లేకుండా పోయిందని వారు వ్యక్తం చేస్తున్నారు.

బుధవారం ఉదయం మంచి మధ్యాహ్నం వరకు మచిలీపట్నంలో 41.2 సెంటీమీటర్లు వర్షం కురిసింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు బందరు పట్నం మునుగుతూ, తేలుతూ ప్రజల సహనానికి పరీక్షలు పెడుతుంది. ఈ వర్షాలకు ముందు నున్నగా కనబడిన రోడ్లు భారీ వర్షాలతో చెత్తాచెదారం అంతా కొట్టుకుపోయి రోడ్లన్నీ రాళ్లు తేలిపోయి, నెర్రులు ఇచ్చి దర్శనం ఇస్తున్నాయి. మచిలీపట్నంలో ఆక్రమణల తొలగింపులో భాగంగా రోడ్డు పక్కన డ్రైనేజీపై పెట్టిన బడ్డీలన్నీ తొలగించారు. ప్రైవేటు వ్యక్తులు తమ ఇళ్ల ముందు డ్రైనేజీపై వేసిన సిమెంట్ బల్లలు, నాపరాళ్లు సైతం తొలగించారు. ఆ డ్రైనేజీలో పేరుకుపోయిన సిల్ట్ తొలగించకపోవడంతో మురుగు నీటిపారుదల సమస్య అపరిష్కృతంగా ఉండిపోయింది. వర్షం కురిసినప్పుడల్లా బందరు పట్నం మునిగిపోవడం పరిపాటిగా మారిపోయింది. ఈ వర్షాలు విరామం ఇచ్చిన తర్వాత అయినా నగరపాలక సంస్థ అధికారులు డ్రైనేజీ వ్యవస్థపై దృష్టి పెట్టి ప్రజల ముంపు కష్టాలు గట్టెక్కించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

5 నుంచి మసుల ఫెస్ట్

సంతోషదాయకమన్నారు. రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా సాంస్కృతిక, పర్యాటక రంగాల్లో ఉన్న ప్రముఖులను ఈ ఉత్సవాలకు ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ పర్యటనలో మెప్మా పీడీ సాయిబాబు, డిఎస్‌డిఓ ఝాన్సీ లక్ష్మి, విజయవాడ క్రీడల అధికారి కోటేశ్వరరావు, తహసీల్దారు హరినాథ్, జల క్రీడల జిల్లా అధ్యక్షులు దావులూరి సురేంద్రబాబు, ఫిలిం ఆర్ట్ డైరెక్టర్ రమణ వంక తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన సేవలందించాలి

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ

రోగులకు మెరుగైన వైద్య సేవలందించడంలో ప్రభుత్వాసుపత్రిని అగ్రస్థానంలో నిలపాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ వైద్యాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ (హెచ్‌డీఎస్) సమావేశం బుధవారం సొసైటీ చైర్మన్, కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వాసుపత్రుల పనితీరుపై సేకరించిన ప్రజాభిప్రాయ నివేదిక ప్రకారం విజయవాడ సర్వజనాసుపత్రికి ఇచ్చిన నివేదికలో వైద్యులు అందిస్తున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, మందుల సరఫరా, పారిశుధ్యం, అవినీతి రహిత సేవలు ఆశించిన స్థాయిలో లేకపోవడం బాధాకరమన్నారు. ఈ విషయంపై వైద్యాధికారులు పునరాలోచన చేయాల్సిన అవసరముందన్నారు. సమావేశాలు మౌలిక వసతుల అభివృద్ధి పనులకే పరిమితం కాకూడదన్నారు. అన్ని విభాగాధిపతులు, సిబ్బంది సమిష్టి కృషిగా టీమ్ జీజీహెచ్ స్ఫూర్తితో పనిచేయాలని ఆదేశించారు. శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే అతిపెద్ద ఆసుపత్రుల్లో ఒకటైన విజయవాడ సర్వజనాసుపత్రిలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మౌలిక వసతుల అభివద్ధితో పాటు రోగులకు మరింత నాణ్యమైన సేవలందించడంలో అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని కోరారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ఆదర్శవంతమైన ఆసుపత్రిగా జీజీహెచ్‌ను తీర్చిదిద్దేందుకు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ అనారోగ్యంతో జీజీహెచ్‌కు వెళితే నాణ్యమైన వైద్య సేవలు పొంది, ఆరోగ్యవంతంగా ఇంటికి తిరిగివెళ్లొచ్చనే భరోసా కల్పించేలా సేవలందించాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ డీఎంఈ డా. వెంకటేష్, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. వెంకటేశ్వరరావు, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డా. పి.అశోక్ కుమార్, ఆర్ఎంవోలు డా. పద్మావతి, డా. మంగాదేవి, డా. శ్రీనివాస్, డా. నాగార్జున, వివిధ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.



వైద్య సేవలను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ఉపాధి హామీలో పండ్ల తోటల పెంపకం : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ: ఉపాధి హామీ చట్టం ఆసరాతో ఉచితంగా పండ్ల తోటల పెంపకాన్ని చేపట్టవచ్చని.. ఈ కార్యక్రమంపై రైతులకు అవగాహన కల్పించి, సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ.. ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకంతో పాటు పశుగ్రాసం పెంపకానికి సంబంధించిన సమాచారంతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఉద్యాన పంటల ద్వారా రైతులకు మెరుగైన ఆదాయాలు లభిస్తాయని, ఈ నేపథ్యంలో అన్నదాతలను ఉపాధి హామీ పథకం ద్వారా ఉచితంగా ఉద్యాన పంటల సాగు చేపట్టేలా చేయిపట్టి నడిపించాలన్నారు. మామిడి, జామ, నిమ్మ, సపోట, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, కొబ్బరి, ఆయిల్‌పామ్, ఆపిల్ బేర్, మునగ, మల్లి, గులాబి తోటల పెంపకానికి సన్న-చిన్నకారు రైతులు (అయిదెకరాల లోపు) అర్హులన్నారు. ఉదాహరణకు మామిడికి ఎకరానికి వివిధ రూపాల్లో రూ. 1,09,950 సాయమందుతుందన్నారు. అదేవిధంగా జామకు ఎకరానికి రూ.1,46,971 మేర సాయమందుతుందని వివరించారు. ఎకరంలో 1,600 మల్లె మొక్కల పెంపకానికి దాదాపు రూ. 1,85,396 సహాయం అందించడం జరుగుతుందన్నారు. పశువులు కలిగిన సొంత భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులు పశు గ్రాసం పెంపకాన్ని కూడా చేపట్టవచ్చని.. 0.50 ఎకరాలో పశుగ్రాసం పెంపకానికి రూ. 32,992 ఖర్చవుతుందని అంచనా వేయగా.. వివిధ పనులకు ఈ మొత్తం మెటీరియల్ లేదా వేజ్ కాంపొనెంట్‌గా అందించడం జరుగుతుందని వివరించారు. ఎస్‌సీ, ఎస్‌టీ, వితంతు, విభిన్న ప్రతిభావంతులైన రైతులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, 10 సెంట్ల నుంచి 50 సెంట్ల వరకు లబ్ధి చేకూర్చడం జరుగుతుందన్నారు. పథకాల ప్రయోజనాలను పొందేందుకు ఎంపీడీవో లేదా ఉపాధి హామీ ఏపీవో లేదా గ్రామ సచివాలయ ఉద్యాన అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్‌లను సంప్రదించవచ్చని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ ఎ.రాము, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్, ఏడీఏ అనిత, డ్వామా జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ కె.ఉష తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయం, దాములూరు

నందిగామ మండలం, ఎన్టీఆర్ జిల్లా.

టెండర్ ప్రకటన

ఆర్ఓసి నెం. **తేదీ.. 20.5.2025**

ఎన్టీఆర్ జిల్లా, నందిగామ మండలం దాములూరు గ్రామ పంచాయతీ కార్యాలయం నందు 2025-26 సం. నకు కాంట్రాక్టు లేబర్ పద్ధతి పై ఈ దిగువ తెలిపిన పనులు చేయుటకు గాను ది. 23.5.2025వ తేదీన ఉదయం 12.00 గం. లకు సీల్డు టెండర్లు స్వీకరించ బడును. అదే రోజు మద్యాహ్నం గం. 2.30 ని.లకు టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరవబడును. పూర్తి వివరాలు ఆఫీసు పని వేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును.

కాలపరిమితి... 01-4-2025 నుండి 31.3.2026 వరకు

వ. నెం.	పని పేరు	ధరావత్తు
1.	పారిశుధ్య పనులు నిర్వహణకు ఒకరు	రూ. 1000/-
2.	వీది విద్యుత్ దీపాలు నిర్వహణ ఒకరు	రూ. 1000/-
3.	మంచినీటి నిర్వహణకు ఒకరు	రూ. 1000/-

గమనిక :- 1. గతంలో గ్రామ పంచాయతీ లో పని చేసిన వారికి ప్రాధాన్యత.
2.గ్రామ పంచాయతీ నిధులు నిల్వ బట్టి వేతనాలు చెల్లింపులు చేయబడును.
3.టెండర్లు నిర్వహణ లేదా రద్దు చేయుటకు గ్రామ పంచాయతీ కి పూర్తి అధికారం కలదు.
4.పైన తెలిపిన పనులే కాకుండా పంచాయతీ కి సంబంధించిన ఇతర పనులు చేయుటకు అంగీకారం తెలుపవలెను.

గాదెల రామారావు, సర్పంచ్,
దాములూరు గ్రామ పంచాయతీ.

ఎస్. వెంకటేశ్వర రెడ్డి, పంచాయతీ కార్యదర్శి,
దాములూరు, నందిగామ మండలం, ఎన్టీఆర్ జిల్లా.

గమ్యం చేరని బస్సులు

- మధ్యలోనే ఆగిపోతుండటంతో ప్రయాణికుల అవస్థలు

ఆగిపోయిన బస్సు

ప్రజాశక్తి-మోపిదేవి : అవని గడ్డ-విజయవాడ మధ్య కరకట్ట రూట్ నడుస్తున్న బస్సులు ఎప్పుడు, ఎక్కడ, ఎలా ఆగిపోతాయో తెలియక ప్రయాణికులు గమ్యం చేరడానికి నానా అవస్థలు పడుతున్నారు. ఈ రూట్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండడం, డిపోలో షెడ్యూల్ టైం కి బస్సులు ఇవ్వకపోవడం, బస్సులు నిర్వహణ సరిగా లేక పోవడం తదితర కారణాలతో 50 మందితో వెళ్లాల్సిన బస్సు 100 మందితో కిక్కిరిసి కుయ్యో మొర్రో అంటూ దున్నపోతుల బండిని తలపిస్తున్నాయి. బుధవారం ఉదయం కొత్త బస్సు నడకుదురు వంతెన వద్ద వెనక టైర్ పంచరు పడి ఆగిపోయింది. వెనక వచ్చే బస్సులో ఆ ప్రయాణికులందరినీ ఎక్కించేసరికి ఆ బస్సు విజయవాడ చేరడానికి మూడు గంటల సమయం పట్టింది. దారి పొడవునా ప్రతి స్టేజీలో ఎక్కే వాళ్లే గాని దిగేవారూ లేరు. ఎక్కడ కమాన్ కట్టలు విరిగిపోతాయో అని డ్రైవర్ బిక్కు బిక్కు మంటూ బస్సు తోలే పరిస్థితి వచ్చింది. అసలు బస్సులే నడవని కరకట్ట రూట్ లో బస్సులు వేసి జనాల్ని అలవాటు చేశారు. దానికి తగ్గ విధంగా మెయింటినెన్స్ చేసి కండిషన్ గల బస్సులు తిప్పడంలో అవనిగడ్డ డిపో యాజమాన్యం తీవ్రంగా విఫలం అవుతుందని ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. ఆఫీసులకు వెళ్లేవాళ్లు ఆలస్యం అయిపోతుందని ఆబ్సెంట్ పడిపోతుందని నానా హైరానా పడిపోతున్నారు. అవనిగడ్డ డిపో యాజమాన్యం కరకట్ట రూట్లో తిరిగే బస్సులను సక్రమంగా సన్నద్ధం చేసి సమయానికి గమ్యం చేరేలా నడపాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్లు బాగుచేయాలని నిరసన

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : చెరువులను తలపిస్తూ అధ్వానంగా ఉన్న రోడ్లను బాగు చేయాలని సిపిఎం నాయకులు కంభం కొండలు బాబు, రంగారావు, అంబటి శ్రీనివాసరావు, దేవిద్రాజు, జుజ్జవరపు ఏసోబు తదితరుల ఆధ్వర్యంలో బుధవారం రోడ్ల దుస్థితిపై నిరసన నిర్వహించారు. కూటమీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత సంక్రాంతి పండగ లోపు రోడ్లన్నీ బాగు చేయాలని నిర్ణయం తీసుకున్నప్పటికీ తోట్లవల్లూరు రోడ్లు అందుకు నోచుకోలేదని, పెద్ద పెద్ద గుంటలతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. భారీ లోడుతో ఉన్న ఇసుక లారీలు రాత్రి పగలు తిరగటం కారణంగా రోడ్లన్నీ గుంతల మైమయ్యాయయని, వర్షం వచ్చినప్పుడు రోడ్లమీద ఉన్న గుంటలలో నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయన్నారు. ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతితులు వెంటనే జోక్యం చేసుకుని రోడ్డు సరిచేయాలని కోరారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి - పామర్రు : వేసవి విజ్ఞాన శిబిరాలలో భాగంగా బుధవారం పామర్రు శాఖా గ్రంధాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం, వార్తాపత్రికలు చదివించడం నేర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎం. శోభారాణి పాల్గొన్నారు. శాఖా గ్రంధాలయం జమీగొల్వేపల్లిలో వేసవి విజ్ఞాన శిబిరాలలో భాగంగా బుధవారం విద్యార్థులచే క్యారమ్స్, చెస్, లూడో, హౌసీ, బిజినెస్ మరియు చైనీస్ చక్కర్ ఆటలను ఆడించి వాటిలో మెలకువలు నేర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ నిర్వాహకులు వి. నాగ సురేష్ మాట్లాడుతూ పిల్లలకు ఆటలు ఆరోగ్యంతో పాటు, బుద్ధి వికాసం, చురుకుదనం కలిగి చక్కటి క్రమశిక్షణ, పట్టుదల, సమయస్ఫూర్తి, ఐకమత్యంవంటి సద్గుణాలు అలవడతాయని అన్నారు.అనంతరం ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి ఉయ్యూరు :** చిన్న నాటినుండి ఇంగ్లీషు భాష పై పట్టు అవసరమని రిసోర్స్ పర్సన్ జె.ప్రదీప్ అన్నారు. ఉయ్యూరు గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిభిరం లో బుధవారం ఆయన పాల్గొని ఇంగ్లీషుభాష నేర్చుకునే విధానం, స్పోకెన్ ఇంగ్లీషుపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా విద్యార్థులతో యోగాభ్యాసన చేయించారు. గ్రంథాలయ అధికారి బి.రమణి, సిబ్బంది పాల్గొన్నారు

పామర్రు గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

కృష్ణా యూనివర్శిటీలో...

ఉయ్యూరులో...

కెయులో యోగా మాసోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : యోగా చేయడం వల్ల మానసికంగా, శారీరకంగా, ఆరోగ్యపరంగా దఢంగా మారడం సాధ్యమవుతుందని కష్ణా విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య కె రాంజీ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పిలుపుమేరకు కష్ణా విశ్వవిద్యాలయంలో బుధవారం యోగా మాసోత్స వాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ మానవుని దైనందిన జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ ఉండడానికి దానికి విరుగుడు క్రమం తప్పకుండా యోగా చేయడమే అన్నారు. అనంతరం యోగా గురువు శ్రీనివాస్ యోగాసనాలు నేర్పించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష, బోధనేతర సిబ్బంది, డైలీ వేజ్ సిబ్బంది, భద్రతా సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు :** యోగా నిత్య సాధన వల్ల మానసిక శారీరిక ఉల్లాసం కలుగుతుందని ఉయ్యూరు రెవిన్యూ డివిజనల్ అధికారి హేలా షారోన్ అన్నారు. బుధవారం మండలంలోని ఆకునూరు జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యోగశిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజుకు అరగంటకు పైగా యోగ సాధన చేయాలని సూచించారు. మండల పరిషత్ అభివద్ధి అధికారి జీఎస్ శేషగిరిరావు మాట్లాడుతూ యోగా ఏకాగ్రతను పెంపొందించడమే కాక ఆరోగ్యానికి ఉపకరిస్తుందని భారతీయ సంస్కతిలో ఒక భాగమైన యోగాను ప్రతి ఒక్కరు ఆచరించాలని సూచించారు ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ సురేష్ పలు రెవిన్యూ అధికారులు గ్రామ సచివాలయ సిబ్బంది కూటమి నాయకులు పాల్గొన్నారు ఈ సందర్భంగా అందరూ యోగాభ్యాసం చేశారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

ప్రజాశక్తి-అవనిగడ్డ : భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 34 వర్ధంతి అవనిగడ్డలో ఘనంగా నిర్వహించారు. బుధవారం నియోజకవర్గ పార్టీ కార్యాలయం వద్ద రాజీవ్ చిత్రపటానికి పూల దండలు వేసి నివాళులర్పించారు. అనంతరం అవనిగడ్డ వంతెన సెంటర్ వద్ద రాజీవ్ గాంధీ విగ్రహానికి ఆ పార్టీ మండల అధ్యక్షులు నరహరిశెట్టి శ్రీమన్నారాయణ పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాగాయలంక మండల పార్టీ అధ్యక్షులు అందే లెనిన్, ఘంటసాల మండల పార్టీ అధ్యక్షులు లంకె ఆంజనేయులు, వర్మ, పార్టీ నాయకులు కాగితాల సుదర్శన్ పాల్గొన్నారు

మృతుల కుటుంబాలకు చెక్కులు అందజేత

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : మచిలీపట్నం నియోజకవర్గంలో అకాల మరణం చెందిన 53 మంది టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు మట్టి ఖర్చుల నిమిత్తం కొల్లు ఫౌండేషన్ తరపున ఒకొక్క కుటుంబానికి రూ.5వేలు చొప్పున మంత్రి కొల్లు రవీంద్ర అందజేశారు. బుధవారం స్థానిక గోల్డ్ కన్వెన్షన్ సెంటర్ లో జరిగిన నియోజకవర్గ స్థాయి మినీ మహానాడులో మంత్రి రవీంద్ర చెక్కులు అందజేశారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 181 మంది కార్యకర్తల కుటుంబాలకు రూ.5వేలు చొప్పున రూ.9.05 లక్షలు అందజేసినట్టు మంత్రి రవీంద్ర తెలిపారు.

చెక్కులు అందిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

భవన నిర్మాణ కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నం మండలం చిన్నాపురం గ్రామానికి చెందిన నందం వెంకటేష్ ఈనెల 15వ తారీఖున అనారోగ్యం కారణంగా మృతిచెందాడు. శ్రీ వెంకటేశ్వర భవన నిర్మాణ కార్మికుల యూనియన్ సంఘం సభ్యుడైన వెంకటేష్ కుటుంబానికి సంఘం తరుపున బుధవారం 9800 రూపాయలు ఆర్థిక సహాయంను కార్యదర్శి కే బ్రహ్మ రావు చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్ జయరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు బి అంకబాబు, రాఘవ,పవన్ కుమార్ శివరామకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 1న సిపిఎస్ ఉద్యోగుల 'పెన్షన్ మార్చ్'

- ఎపి సిపిఎస్ఇబి రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు బాజీపఠాన్, రాజేశ్వరరావు

ప్రజాశక్తి- కలక్టరేట్ (కృష్ణా) : సీపీఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ తమ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తున్నట్లు ఏపీ సిపిఎస్ ఇ బి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బాజీ పఠాన్, కరిమి రాజేశ్వరరావు తెలిపారు. జిల్లాల చైతన్య యాత్రలో బాగంగా బుధవారం జిల్లా కలక్టరేట్ లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు సెప్టెంబర్ 1, 2004 తర్వాత ప్రభుత్వ రంగ శాఖలలో ఉద్యోగంలో చేరిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు దాదాపు 3.5 లక్షల మంది ఉన్నారని సీపీఎస్ విధానం ఈ ఉద్యోగుల జీవితాలను దుర్భరం చేసిందన్నారు.గత 21 సంవత్సరా లుగా కష్టాలు, నష్టాలు, అణచివేత, ఆత్మగౌరవ భంగం తప్ప ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. సమస్యలపై అధికారులు, ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా స్పందన కరువైం దన్నారు. ప్రభుత్వ స్పందన కరువ వడ ంతో, సెప్టెంబర్ 1న గుంటూరు నుండి విజయవాడ వరకు భారీ ఎత్తున "పెన్షన్ మార్చ్" నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సంఘం సభ్యులు, ఏపీ జి ఈ ఏ కష్ణాజిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి. రాము, తోట వర ప్రసాద్,కార్యనిర్వాహక కార్యదర్శి సింహాద్రి రాంబాబు, ఉపాధ్యక్షులు లోకేశ్, కటేశ్వరరావు, అన్మర్, కె.వి. రమణ, దుర్గేష్, రాజేష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా పెన్షన్ మార్చ్ గోడ పత్రికను ఆవిష్కరించారు.

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

ట్రాఫిక్ నియమాలపై ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : వాహన చోదకులు ట్రాఫిక్ నియమాలు కచ్చితంగా పాటించాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్ఐ బి.లక్ష్మణ్ హెచ్చరించారు. ట్రాఫిక్ నియమాలు పాటించని వారిపై ప్రత్యేక డ్రైవ్‌ను ట్రాఫిక్ పోలీస్ విభాగం ప్రారంభించింది. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణ్ మాట్లాడుతూ నెంబర్ ప్లేట్ లేని వాహనాలను, ద్విచక్ర వాహనంపై ఫోన్ మాట్లాడుతున్న, ముగ్గురు వెళ్తున్న వాళ్ళపై, అత్యంత వేగంగా, అదుపు లేకుండా నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్ నియమాలు పాటించని వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. నెంబర్ ప్లేట్లు లేని వాహనాలను ఆపి నెంబర్ ప్లేట్ లేని వాహనాలు నేర చర్యలకు ఉపయోగించే అవకాశం ఉన్నందున్న వాటిని స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. రాష్ డ్రైవింగ్ వల్ల ప్రజలకు ప్రాణహాని కలిగే ప్రమాదం ఉందన్నారు. వాహన చోదకులు తమ వాహన చోదకులు తమ వాహనాలకు తప్పనిసరిగా నెంబర్ ప్లేట్ ఏర్పాటు చేసుకోవాలని, సురక్షితంగా ప్రయాణం చేయాలని సూచించారు. మనం చేసే ఒక తప్పు వల్ల మన కుటుంబంతో పాటు మరో కుటుంబం పై ప్రభావం చూపే అవకాశం ఉందని అన్నారు. వాహనాలను నడిపేటప్పుడు తప్పనిసరిగా కుటుంబ సభ్యులను కుటుంబాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలు పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు.

యజ్ఞశాల నిర్మాణం ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానం (పెద్ద రామాలయం)లో ఈ నెల 30 నుండి జూన్ 2 వరకు జరిగే స్వామివారి ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా బుధవారం యజ్ఞశాల (యాగశాల) కట్టుబడిని ఎంఎల్ఎ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి బెనర్జీ, కర్రి శేషగిరిరావు (చిన్న), మన్నె నారాయణ రావు, పేరూరి కోటేశ్వరరావు, కామినేని కిషోర్, దొప్పలపుడి రాంప్రసాద్, దేవరశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ బాధితుడికి సాయం

ప్రజాశక్తి - భవానీపురం : విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని 45వ డివిజన్‌కి చెందిన గుంటూరు శివ అనే వ్యక్తి టంగ్ కేన్సర్‌తో బాధపడుతున్నారు. చికిత్స పొందుతూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది. దీంతో స్పందించిన జనసేన నాయకులు తిరుపతి అనూషను బాధితులు ఆశ్రయించగా ఆమె శివ ఇంటికి వెళ్లి పరామర్శించి సరుకులు, బియ్యం, పండ్లు అందజేశారు. శివ పిల్లల స్కూల్ ఫీజ్ పెండింగ్‌లో ఉంటే తామే చెల్లిస్తామని అనూష హామీ ఇచ్చారు. ఆమె వెంట 45వ డివిజన్ అధ్యక్షులు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బొమ్ము గోవిందలక్ష్మి, పశ్చిమ నియోజకవర్గం ఐటీ కోఆర్డినేటర్ మంతాపురం రాజేష్, 44వ డివిజన్ ఉపాధ్యక్షులు కార్తీక్, 43వ డివిజన్ నాయకులు దాసి రామ్మోహన్, కానాల వినోద్ కుమార్, 42వ డివిజన్ నాయకులు తిరుమరెడ్డి గణేష్, వుడుత్తు మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలతో బోధనకు పదును

ప్రజాశక్తి - వన్‌టౌన్ : నిరంతరమైన పరిశోధన, నూతన అంశాల పట్ల అన్వేషణ దృక్పథం అధ్యాపకుల బోధనను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దుతాయని కెబిఎన్ కళాశాల కార్యదర్శి డాక్టర్ టి.శ్రీనివాసు అన్నారు. కళాశాల పిజి కంప్యూటర్స్ విభాగాధిపతి డాక్టర్ మల్లాది వి.టి.రామ్ పవన్ తైవాన్‌లోని ఎన్.కె.యు.ఎస్.టి విశ్వవిద్యాలయం నుంచి పోస్ట్ డాక్టరల్ ఫెలోషిప్ అందుకున్న సందర్భంగా బుధవారం కళాశాలలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తమ అధ్యాపకుడు ప్రతిష్టాత్మకమైన పోస్ట్ డాక్టరల్ ఫెలోషిప్ పొందటం తమ కళాశాలకు గర్వకారణం అన్నారు. హిందూ హైస్కూల్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ పవన్ కుమార్ 'డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ డీప్ లెర్నింగ్ మెథడ్ ఫర్ క్లారిఫికేషన్ అండ్ డిటెక్షన్ ఆఫ్ కోలోరెక్టల్ కేన్సర్' అనే అంశంపై చేసిన పరిశోధనకు గానూ ఫెలోషిప్ అందుకున్నారన్నారు. పవన్ రాసిన పరిశోధన పత్రాలు అనేక అంతర్జాతీయ పత్రికల్లో ప్రచురితమయ్యాయని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ కేవలం బోధనకు పరిమితం కాకుండా పవన్ కుమార్ తన విద్యార్థులను కూడా కంప్యూటర్ రంగంలో పరిశోధకులుగా తీర్చిదిద్దారని, విద్యార్థుల్లో అన్వేషణ నైపుణ్యాలు పెంపొందించేలా బోధిస్తారని ప్రశంసించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పి.ఎల్.రమేష్ కూడా తమ ప్రసంగాల్లో పవన్ కుమార్ చేసిన పరిశోధనలు, బోధనలో ఆయన చేస్తున్న ప్రయోగాలను అభినందిస్తూ ప్రసంగించారు. హిందూ హైస్కూల్స్ కమిటీ జనరల్ సెక్రెటరీ గోపిశెట్టి మల్లయ్య, తదితరులు పవన్ కుమార్‌ను అభినందించారు.

రామ్ పవన్‌ను సత్కరిస్తున్న శ్రీనివాసు

దుర్గమ్మను దర్శించుకున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ కనక దుర్గమ్మ వారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు కె.అచ్చెన్నాయుడు బుధవారం దర్శించుకున్నారు. ఇంద్రకీలాద్రికి విచ్చేసిన వీరిని ఆలయ కార్య నిర్వాహణాధికారి వి.కె.శీనానాయక్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, అమ్మవారి దర్శనం అనంతరం వేద ఆశీర్వచనం, చిత్రపటం ప్రసాదం అందించారు.

'ఒక దేశం ఒకే ఎన్నిక'పై అవగాహన

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం కేంద్ర కార్యాలయంలో బుధవారం 'ఒక దేశం ఒకే ఎన్నిక' అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమం యువతను ఆలోచింప చేసిందని విజయవాడ ప్రాంతీయ కేంద్రం సీనియర్ రీజనల్ డైరెక్టర్ డి.ఆర్.శర్మ తెలిపారు. ఢిల్లీలోని కేంద్ర కార్యాలయం నుంచి దేశవ్యాప్తంగా ఉన్న 57 ఇగ్నో ప్రాంతీయ కార్యాలయాలతో పాటు విజయవాడ ప్రాంతీయ కేంద్రాలయంలోనూ ప్రత్యేక అభ్యాస మాధ్యమాల ద్వారా సిబ్బంది, విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని వీక్షించి అనుమానాలను నివృత్తి చేసుకున్నారు. కేంద్ర వ్యవసాయ, గ్రామీణ వికాస రైతు సంక్షేమ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ ప్రసంగం ఆకట్టుకుందని శర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు డాక్టర్ కె. సుమలత, డాక్టర్ పి శరత్ చంద్ర, డిప్యూటీ రిజిస్ట్రార్ సి హెచ్, బాలచందర్ ఇతర అధికారులు సిబ్బందితో పాటు స్థానిక ఇగ్నో అధ్యయన కేంద్ర సమన్వయ కర్త డాక్టర్ యమ్. వెంకటేశ్వర రావు, సహాయక సమన్వయకర్తలు, అకడెమిక్ కౌన్సెలర్లు, విద్యార్థులు ఉత్సాహంగా ఉన్నారు.

ఎండియు వాహనాలను కొనసాగించాలని నిరసన

ప్రజాశక్తి - ఎ.కొండూరు : తిరువూరు విజయవాడ జాతీయ రహదారిపై ఎ.కొండూరు మండలం చీమలపాడు గ్రామ మెయిన్ సెంటర్‌లో బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం చౌకడిపోల ద్వారా ఇంటింటికి రేషన్ సరఫరా చేసే ఎండియు వాహనాలను జూన్1 నుండి నిలిపివేయాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మండల సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి పానెం ఆనందరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల వ్యవసాయ కూలీలు, పేదలు రేషన్ షాపుల వద్ద రోజులు తరబడి తిరగాల్సిన పరిస్థితి నెలకొంటుందని, దీని వల్ల వ్యవసాయ కూలీలు పని దినాలు కోల్పోతారని, వయోభారం వల్ల రేషన్ షాపులకు వెళ్లే పరిస్థితి లేదన్నారు. బియ్యం అక్రమాలను అరికట్టలేక పేదలకు సరఫరా చేసే సివిల్ సప్లై వాహనాలను నిలిపి వేయటం చాలా దుర్మార్గమైన చర్యన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకొని ఎప్పటిలాగే తిరిగే వాహనాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. వినియోగదారులకు చౌక ధరల డిపోల ద్వారా 16 రకాల నిత్యావసర సరుకులను అందజేయాల్సిన ప్రభుత్వం పేద ప్రజలకు సరుకులను అందించడం లేదని, తక్షణమే కందిపప్పు, పామోలిన్ తదితర నిత్యావసర సరుకులు కూడా ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గ్రామ కార్యదర్శి సోమా ఆనందరావు, ఎస్.కోటయ్య, ఎస్.మోహన్ రావు, పి.గోపి, బెజ్జం బేబీ, ఎస్.మరియమ్మ, కల్పనా దేవి, కొండేటి పార్వతి, కొర్లపాటి దయామణి, పాలపాటి సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, మహిళలు, స్థానికులు

పలు కార్యాలయాల్లో యోగాసనాలు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల రెవెన్యూ సిబ్బంది యోగా డే నిర్వహించారు. తహసీల్దార్ సుశీలదేవి నేతృత్వంలో రెవెన్యూ శాఖ సిబ్బంది యోగాడే సందర్భంగా యోగా చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గంధం పుల్లయ్య, విఆర్‌ఒలు, సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గయ్యపేట : మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.నితిన్ ఆధ్వర్యంలో బుధవారం యోగాసనాలు నిర్వహించారు. ఈ కార్యక్రములో మండల పరిషత్ పరిపాలనాధికారి వైఎస్.మాధవ శర్మ, సీనియర్ సహాయకులు బి.కిశోర్ కుమార్, పంచాయతీ కార్యదర్శి బి.శివాజీ, చిల్లకల్లు, తిరుమలగిరి, తొర్రగుంటపాలెం సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నందిగామ : నందిగామలో బుధవారం ప్రభుత్వ అధికారులు యోగా చేశారు. నందిగామ ఆర్‌డిఒ బాలకృష్ణ, తహశీల్దార్ సురేష్ బాబు, కమిషనర్ జి.వి.రమణ బాబు యోగా చేశారు. జూన్ 21 యోగా దినోత్సవం సందర్భంగా నందిగామ పట్టణంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉదయం యోగా మాసం ప్రారంభించారు. సన్నాహక యోగా క్లాసులు ప్రారంభ కార్యక్రమాల్లో భాగంగా నందిగామ ఆర్‌డిఒ, తహశీల్దార్, మున్సిపల్ తదితర ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అధికారులకు యోగా క్లాసులు నిర్వహించారు. యోగా క్లాసులకు ఆర్‌డిఒ బాలకృష్ణ, తహశీల్దార్ సురేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ జి.వి.రమణ బాబు ముఖ్య అతిథులుగా విచ్చేసి యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ బాలకృష్ణ మాట్లాడుతూ మానసిక విశ్రాంతికి శారీరక ఆరోగ్యానికి యోగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఈ రోజు యోగా చేయటం ఎంతో సంతోషంగా ఉందని, యోగా గురుజి సీతారాం అధికారులు అందరికీ యోగ బాగా నేర్పించారని అన్నారు. యోగా గురుజీ సీతారాంను అభినందించారు.

కంచికచర్ల : యోగా డే వేడుకలు బుధవారం కంచికచర్లలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో ఆయా శాఖల సిబ్బంది యోగా చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో డిప్యూటీ తహశీల్దార్ వేమూరి మానస, రెవెన్యూ సిబ్బంది ఉదయాన్నే యోగా చేశారు. ఎక్సైజ్ కార్యాలయాలు వద్ద సిఐ అప్రుఉన్నీసా ఆధ్వర్యంలో సిబ్బంది యోగాసనాలు వేశారు.

కంచికచర్లలో యోగాసనాలు వేస్తున్న సిబ్బంది

రెడ్డిగూడెంలో యోగాసనాలు వేస్తున్న సిబ్బంది

జగ్గయ్యపేటలో యోగాసనాలు వేస్తున్న సిబ్బంది

నందిగామలో యోగాసనాలు వేస్తున్న సిబ్బంది

యోగాతో మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం

- జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ



మాట్లాడుతున్న జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : యోగా సాధనతో ప్రతి ఒక్కరు మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని, యోగ కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వామ్యులై ఆరోగ్యవంతులు కావాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ పిలుపునిచ్చారు.రానున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం నేపథ్యంలో బుధవారం నగరంలోని జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్లో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో యోగాంధ్ర 2025 ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది.తొలుత జాతీయ, అంతర్జాతీయ యోగా పోటీలలో బంగారు పతకం సాధించిన శిరీష ఆధ్వర్యంలో నిర్ణీత ప్రోటో కాల్ ప్రకారం వజ్రాసనం, తాడాసనం, వక్షాసనం, త్రికోణాసనం, ఉష్ట్రాసనం, శశాంకాసనం, మకరాసనం, భుజంగాసనం, సేతుబందాసనం, ఉత్థాన పాదాసనం, పవనముక్తాసనం, అమతాసనం వంటి ఆసనాలు, కపాల భాతి, నాడీ శోధన, శీతలి, భ్రామరి ప్రాణాయామాలు అందరిచేత చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 21వ తేదీ వరకు నెలరోజులపాటు జిల్లాలో యోగా పోటీలు తదితర పలు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. యోగా సాధన వలన ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ముఖ్యంగా మనసుతో శరీరం అనుసంధానం కావడం వలన సంపూర్ణ ఆరోగ్యంతో ఆనందంగా ప్రశాంతమైన జీవనం సాగించవచ్చున్నారు. జూన్ 21వ తేదీన జిల్లాలో మంగినపూడి బీచ్ లో పెద్ద ఎత్తున యోగా కార్యక్రమం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. .ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, ఆర్డిఓ కే స్వాతి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి చిన్న నరసింహులు, జిల్లా విద్యాధికారి రామారావు, డి ఎస్ డి ఓ ఝాన్సీ లక్ష్మి, డీఎస్పీ సిహెచ్ రాజా, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రత్నకోడు డ్రైనేజీ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-కోడూరు : అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కషితో రత్నకోడు మేజర్ డ్రైనేజీ అభివద్ధి పనులు చేపట్టినట్లు తూర్పు కష్ణా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం కోడూరు మండలం లింగారెడ్డిపాలెంలో స్టేట్ డిజాస్టర్ మిటిగేషన్ ఫండ్స్ - ఎస్.డీ.ఎం.ఎఫ్ నిధులు రూ.64 లక్షలతో లింగారెడ్డిపాలెం నుంచి అవనిగడ్డ మండలం అశ్వారావుపాలెం వరకూ ఆరు కిలోమీటర్లు పొడవునా రత్నకోడు మేజర్ డ్రైనేజీలో పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. ఈ పనులను పీసీ చైర్మన్ వెంకటేశ్వరరావు వాహన పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో వ్యవసాయ రంగ అనుబంధ శాఖలు ఇరిగేషన్, డ్రైనేజీ శాఖల్లో విస్తత అభివద్ధి పనులు చేపట్టారని తెలిపారు.డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ్ ప్రసాద్, డ్రైనేజీ శాఖ డీఈఈ జే.బాబు నాయక్, ఏఈఈ అబ్దుల్ కరీం, గ్రామ ప్రముఖులు యర్రంశెట్టి దామోదర్, రైతులు పాల్గొన్నారు.

టిడ్కో కాలనీలో చెత్తను తొలగించాలి

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడ మండలం మల్లాయిపాలెం శివారు టిడ్కోకాలనీలో రోడ్లపై చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తున్నదని, డ్రైనేజీలలో మురుగు నీరు నిల్వ వుండి దోమలవ్యాప్తితో రోగాలు ప్రబలే ప్రమాదముందని సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్.సి.పి.రెడ్డి ఆరోపించారు. మున్సిపల్ కమషనరుకు ఫిర్యాదు చేయగా రెండురోజులకొకసారి 20మంది సిబ్బందిని పంపి పారిశుధ్యం పనులు చేపడుతున్నారన్నారు. అయినా కాలనీలో పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదన్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తడి పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలి

- జిల్లా పంచాయతీ అధికారి జె.అరుణ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు మండలంలో బుధవారం జిల్లా పంచాయతీ అధికారి డాక్టర్ జె. అరుణ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి త్వరితగతిన వర్మి తయారు చేయుటకు తగు చర్యలు తీసుకోవాలని, వచ్చిన వర్మిని స్థానిక రైతులకు పొలాల సస్య రక్షణకు వినియోగించుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ వద్ద మండలంలోని పంచాయితీ కార్యదర్శులతో ఇంటి పన్ను వసూలు, స్వర్ణ పంచాయితీలో వసూలు చేసిన ఇంటి పన్ను వసూలు నమోదు, గ్రామ పంచాయితీలోని ఇళ్ల యజమానుల ఆదార్ నెంబర్ ను సేకరించి స్వర్ణ పంచాయతీలో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతి రోజు ప్రతి ఇంటి నుండి తడి చెత్త ,పొడి చెత్త విడివిడిగా హరితరాయబారులతో సేకరించాలని తెలిపారు. చంద్రాల గ్రామంలో గ్రామ పంచాయితీ ఏరియాలో గల స్కూల్లో విజిబుల్ ఎసెంట్ లో భాగంగా ఆట వస్తువులను ఏర్పాటు చేయడంపట్ల దాతలను అభినం దించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో టీ విజయ సారధి, పంచాయతీ కార్యదర్శులు ఎజేఎల్ నరసింహారావు, ఎలీషా రావు పాల్గొన్నారు.

28న గన్నవరంలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-గన్నవరం : నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈనెల 28వ తేదీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ప్రతినిధులు బుధవారం తెలిపారు. గన్నవరం నియోజకవర్గంలోని యువతకు స్థానికంగా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు గాను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు గన్నవరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఉదయం 9 గంటల నుండి ఈ జాబ్ మేళా జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించే ఈ జాబ్ మేళాలో ఏడవ తరగతి నుంచి పదవ తరగతి, ఇంటర్,డిగ్రీ, ఐటిఐ, పాలిటెక్నిక్ పాస్ అయిన యువతీ యువకులు ఈ జాబ్ మేళాకు హాజరై తమ విద్యార్హతలకు తగిన ఉద్యోగాన్ని పొందాలని వారు సూచించారు. ఈ జాబ్ మేళాలో కష్ణ, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలలోని పదికి పైగా ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని తమ కంపెనీ అవసరాలకు కావలసిన యువతను ఎంపిక చేస్తారని చెప్పారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఫోటో స్టార్ట్ కాపీలు ఆధార్ కార్డు వెంట తెచ్చుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9494005725, 6300618985, 9666654641లో సంప్రదించాలని సూచించారు. ఈమేరకుగన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ తన క్యాంపు కార్యాలయంలో జాబ్‌మేళా కరపత్రాలను ఆవిష్కరించారు.

అన్నదాత సుఖీభవపై స్పష్టత ఇవ్వాలి

ప్రజాశక్తి- మొవ్వ : అన్నదాత సుఖీభవ పథకంపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, విధివిధానాలు ప్రకటించాలని ఏపి కౌలు రైతులు సంఘం క్రిష్ణాజిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ మంత్రివర్గ సమావేశంలో అన్నదాత సుఖీభవపై స్పష్టమైన ప్రకటన రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాలేదని, అన్నదాత సుఖీభవ కౌలు రైతులందరికీ ఇస్తామని శాసనసభలో శాసనమండలిలో వ్యవసాయ శాఖ మంత్రి ప్రకటించారనీ, కానీ వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న సందర్భంగా అన్నదాత సుఖీభవ విధివిధానాలు ప్రకటించకపోవడం పై అనేక అనుమానాలు వస్తున్నాయన్నారు. కాబట్టి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ సంబంధించి విధివిధానాలు ప్రకటించాలని, వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతుంది కాబట్టి వెంటనే వ్యవసాయ పెట్టుబడుల కోసం 20 వేల రూపాయలను ఒకేసారి రైతుల ఖాతాల్లో కౌలు రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు.

యూనివర్శిటీ ఆదేశాలు అమలు చేయాలి

- కెయు ఉపకులపతి ఆచార్య కె రాంజీ

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : విశ్వవిద్యాలయం నుండి అనుబంధ కళాశాలలకు వచ్చే ఆదేశాలకు వెంటనే స్పందించాలని కృష్ణా విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య కె రాంజీ పేర్కొన్నారు. బుధవారం కృష్ణా విశ్వ విద్యాలయం అనుబంధ కళాశాలల ప్రిన్సిపల్స్ తో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛంద్రా, యోగాంధ్రా కార్యక్రమాలను షెడ్యూల్ కు అనుగుణంగా క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, కష్ణా విశ్వవిద్యాలయం రూపొందించిన అకడమిక్ క్యాలెండర్ ను ఖచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రిన్సిపల్స్ లేవనెత్తిన పలు అంశాలపై స్పందించి నివత్తి చేశారు. ఈ మీటింగ్ లో రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష, అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేస్తాం : మంత్రి

మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ప్రజాస్వామ్య బద్ధమైన సిద్ధాంతాలు, విధివిధానాలు, గత 44 సంవత్సరాలుగా తెలుగ ుదేశం పార్టీని కాపాడు తున్నాయని రాష్ట్ర గనులు, భూగర్భ వన రులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నంలో బుధవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ తెలుగు ప్రజల కోసం ఏర్పడిన తెలుగుదేశం పార్టీ స్ఫూర్తిని గుర్తు చేసుకోవాలన్నారు. నాడు ఏ ఆశయాలతో పార్టీని స్థాపించారో తెలుగు జాతి ఉన్నంత కాలం తెలుగుదేశం నిలిచే ఉంటుందన్నారు. కష్టపడి పని చేసిన వారు ఎక్కడున్నా పదవులిచ్చిన ఘనత తెలుగుదేశం పార్టీదేనన్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఉచిత బస్సు పథకాలను త్వరలోనే అమలు చేయబోతున్నామని, అని ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకోవాలనే లక్ష్యం నిర్దేశించుకు న్నామన్నారు. బందరు పోర్టును 2026లో ప్రారంభిం చుకోబోతున్నామని, అలాగే ఫిషింగ్ హార్బర్ నిర్మాణాన్ని పూర్తి చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ టీ సీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ రావు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో తెలంగాణ హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవిలో భక్తుల చేత విశేష పూజలు అందుకుంటున్న శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామినీ బుధవారం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జస్టిస్ పి. శ్రీసుధ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.దేవస్థానానికి వచ్చిన జస్టిస్ పి. శ్రీ సుధ కుటుంబానికి ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలో గల నాగపుట్టలో పాలు పోసి, మొక్కుబడులు చెల్లించుకున్న అనంతరం పి. శ్రీ సుధ దంపతులు స్వామి వారిని దర్శించుకొనగా, ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పి. శ్రీ సుధ దంపతులను ఆలయ మర్యాదలతో శ్రీరామ వరప్రసాదరావు ఘనంగా సత్కరించి, ప్రసాదాలను అందజేసి, శ్రీ స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించారు.

రాజీవ్ గాంధీ వర్ధంతి

ప్రజాశక్తి - మైలవరం : మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని బుధవారం మైలవరంలో ఘనంగా నిర్వహించారు. మైలవరంలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా నాయకులు బొర్రా కిరణ్ మాట్లాడుతూ దేశంలో సాంకేతిక విప్లవాన్ని తీసుకువచ్చిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాల సాధన ధ్యేయంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దోసపాటి గిరిధర్, పిట్టల నాగేశ్వరరావు, సుధాకర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు : భారతదేశ మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ 34 వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు తిరువూరు రాజీవ్ భవనంలో బుధవారం నిర్వహించారు. అయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి దేశానికీ ఆయన చేసిన మహోన్నత సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొడ్డు ప్రకాశరావు, అశోక్, గంధం శ్రీనివాసరావు, జీడిమళ్ల వెంకటేశ్వరరావు, రామిశెట్టి జగన్నాధం, ఇజ్జాడ జగన్నాధం, కుదరవల్లి రమణారావు, చిన్నం శెట్టి నాగేశ్వర రావు, గరికపాటి నరసింహారావు, షేక్ ఈసూబ్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని గ్రేడ్ 1 శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా బుధవారం విద్యార్థులచే మొదట పుస్తక పఠనం, దేశ నాయకుల పుస్తకాలు చదివించారు. అనంతరం ఆంగ్ల ఉపాధ్యాయులు వినోద్ బాబుచే స్పోకెన్ ఇంగ్లీష్ చెప్పించారు. అనంతరం విద్యార్థులకు ఆటవిడుపుగా ఖోఖో ఆట ఆడించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ప్రభ, సిబ్బంది జె.శామల, రమేష్, రాము పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణకు హోమియో మందుల పంపిణీ

ప్రజాశక్తి - నందిగామ : వడదెబ్బ బారిన పడకుండా ఉండేం దుకు అవసరమైన జాగ్రత్త చర్యలు ప్రతి ఒక్కరూ పాటించాలని ప్రముఖ హోమియో వైద్యులు డాక్టర్ బొందల పాటి నరసింహా రావు సూచించారు. లైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నందిగామ గాంధీ సెంటర్‌లో బుధవారం వడదెబ్బ నివారణకు హోమియో మందుల పంపిణీ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని నందిగామ పట్టణ సిఐ వైవిఎల్‌వి నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయం నుండి సాయంత్రం వరకు లైన్స్ క్లబ్ ప్రతినిధులు ప్రజలకు వడదెబ్బ నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్బు ప్రతినిధులు అమ్మినేని జ్వాల ప్రసాద్, టి.సీతారామయ్య, ఎం.సీతా రామయ్య, వై.గాంధీ, మారం సత్యం, ఆర్.ఎల్. నరసింహారావు, నూకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల అలసత్వంతో ప్రజల్లో అసంతృప్తి

ప్రజాశక్తి - నందిగామ : రెండు సంవత్సరాలు తర్వాత వచ్చిన కొత్త రేషన్ కార్డు జారీ, సవరణ విషయంలో కూటమి ప్రభుత్వం తీసుకున్న ప్రతిష్టాత్మక నిర్ణయానికి ప్రజలు వారి నిరీక్షణకు న్యాయం జరిగిందని హర్షించారు. కొత్త రేషన్ కార్డుల జారీ, సవరణ విషయంలో అధికారుల అలసత్వం వల్ల ప్రజలు విసిగిపోతున్నారు. రేషన్ కార్డ్ అప్లికేషన్ సచివాలయం ఆన్లైన్ చేసుకున్న తర్వాత సదరు సచివాలయంలోనే ఈకేవైసీ పూర్తి చేసుకున్న తర్వాత విఆర్ఒ లాగిన్‌లకు అప్లికేషన్లు వస్తాయి. విఆర్ఒ లాగిన్ నుంచి ఎంఆర్ఒ లాగిన్‌కి ఫార్వర్డ్ అవుతాయి. సదరు ప్రక్రియలో విఆర్ఒ లాగిన్‌లో అప్రూవ్ కొట్టడానికి సవాలక్ష కుంటి సాకులు చెప్పి, ఎన్నో అప్లికేషన్లు పెండింగ్‌లో ఉంచారు. పెండింగ్‌లో ఉన్న అప్లికేషన్లు వెంటనే పరిష్కరించాలని అర్జీ దారులు మొరపెట్టుకుంటున్నారు. 21 రోజులు పడుతుందనే కుంటి సాకుతో ఆన్లైన్ చేసిన అప్లికేషన్ అన్ని పెండింగ్లో పెడుతున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని విధుల్లో అలసత్వం ప్రదర్శించిన వారిపై చర్యలు తీసుకొని, తమ సమస్యలు పరిష్కారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆధార్ కేంద్రాల వద్ద ఇబ్బందులు తొలగించాలి

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పరిసర ప్రాంతాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు వద్ద ఇబ్బందులు లేకుండా చూడాలని నందిగామ చెందిన న్యాయవాది ఆజాద్ బుధవారం నందిగామ ఆర్‌డిఒ కార్యాలయం వద్ద సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ప్రజలు, చిన్నపిల్లలు ముఖ్యంగా వృద్ధులు ఆధార్ నమోదు కేంద్రాలకు వెళ్లి పడిగాపులు కాస్తూ ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. గడువు దగ్గర పడుతున్న పరిస్థితుల్లో ఆధార్ నమోదు చేసుకోవడానికి ఆధార్ కేంద్రాలకు వెళ్లిన, బ్యాంకులకు వెళ్ళిన సర్వర్ పని చేయడం లేదని రాసి డిస్‌ప్లే చేయడం, పోస్ట్ ఆఫీస్‌కి వెళితే టోకెన్ సిస్టం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు టోకెన్ ఉన్న వారికి ఆధార్ నమోద్ అని, ఆ తర్వాత వెళ్లిన వారికి టోకెన్స్ టైం అయిపోయాయని ఈ విధంగా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వద్ధులు, చిన్న పిల్లలు, ప్రజలు ఈ పరిస్థితిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి గడువు పూర్తయ్యే లోపు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయమై ప్రజల తరఫున రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయంలో సీనియర్ న్యాయవాది షేక్ ఆజాద్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీరామకృష్ణకు వినతి పత్రం అందజేశారు.

పచ్చిరొట్ట విత్తనాలపై 50 శాతం సబ్సిడీ

ప్రజాశక్తి - తిరువూరు : రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు వ్యవసాయ శాఖ ద్వారా అన్ని రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి పి.పద్మ తెలిపారు. జనుము 10 కిలోల సంచులు, పిల్లి పెసర 8 కిలోల సంచులు, మిక్స్‌డ్ సీడ్ కిట్ 10 కిలోల సంచులు రైతు సేవాకేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, కావలసిన రైతులు సిబ్బందిని సంప్రదించి పొందాలని ఆమె చెప్పారు. ప్రధాన పంట వేయడానికి ముందు పచ్చిరొట్ట పంటలను భూమిలో వేసి 50 శాతం పూత దశలో భూమిలో కలియ దున్నితే పోషకాలంది భూమి సారవంతం అవుతుందన్నారు. ఎకరానికి ఒక బ్యాగ్ చొప్పున గరిష్టంగా ఒక రైతుకు ఐదు బ్యాగుల వరకు పచ్చిరొట్ట విత్తనాలు ఇస్తామని చెప్పారు. మునకుళ్ళ రైతు సేవా కేంద్రంలో బుధవారం ఆమె రైతులకు జీలుగు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎస్.కె.రజియా సుల్తానా, రైతులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే

ప్రజాశక్తి - నందిగామ : చినుకు పడితే చాలు నందిగామ రామన్నపేట రహదారి ప్రయాణం చాలా ప్రమాదకరం. కొద్దిపాటి వానకే నందిగామ పట్టణంలో రామన్నపేట ప్రధాన రహదారి చెరువులను తలపిస్తుంది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక పోవడంతో, డ్రైనేజీలో నీరు ప్రధాన రహదారిపైకి చేరి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నందిగామ రామన్నపేట రోడ్డులో గల అమ్మ డయాగ్నోస్టిక్స్ సెంటర్ వద్ద డ్రైనేజీ కల్వర్టు రహదారి కన్నా ఎత్తుగా ఉండటం వల్ల పశువుల ఆస్పత్రి దగ్గర నుంచి రహదారి పల్లంగా ఉండటంతో వర్షపు నీరు మొత్తం అమ్మ డయాగ్నోస్టిక్స్ సెంటర్ వద్దకు చేరి వాహన దారులు, ప్రయాణికులు, రోగులు, కోర్టు సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. డివిఆర్ కాలనీ మొదలుకొని రామన్నపేట వరకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ రహదారి వెంట ప్రయాణిస్తున్నారు. పెద్ద ఎత్తున నీరు అక్కడ నిల్వ ఉండటంతో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలతో పాటు ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించాలని వాహనదారులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

నందిగామలో బుధవారం మధ్యాహ్నం జోరు వర్షం కురిసింది. రహదారులు జలమయమయ్యాయి. తీవ్ర ఉక్కపోతతో ఇబ్బంది పడిన పట్టణ వాసులు ఒక్కసారిగా వర్షం కురవడంతో వాతావరణం చల్లబడి సేదతీరారు. అయితే ఈ వర్షం వలన ద్విచక్ర వాహనదారులు, చిరు వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

అస్తవ్యస్త డ్రైనేజీపై అధికారుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి - విజయవాడ : డ్రైయినేజి వ్యవస్థ అస్తవ్యస్తంగా, అధ్వాన్నంగా తయారయ్యి చిన్నపాటి వర్షానికే వీధులన్నీ తటాకాలుగా దర్శనమిస్తూ స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా నగరంలోని స్థానిక ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, అధికారులు అత్యంత బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్నారని, వారి వైఖరి మార్చుకోకపోతే ప్రజలను కలుపుకొని ఉద్యమించాల్సి వస్తోందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ హెచ్చరించారు. స్థానిక శ్రీశ్రీభవన్‌లో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ విజయవాడ నగరం అస్తవ్యస్తంగా తయారయ్యి, మురుగు తాండవిస్తూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సెంట్రల్ నియోజకవర్గంలోని ముఖ్యంగా 23వ డివిజన్‌తో పాటు తాయా డివిజన్లలో యుజిడి వ్యవస్థ నిర్వహణ సరిగా లేక, షిల్టు తొలగింపు పనులు కూడా సరిగా లేక, మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లుతూ వీధులన్నీ దుర్గంధ పూరితంగా తయార వుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాపార సముదాయాలు, ప్రభుత్వ కార్యాల యాలు, వైద్యశాలలు, ప్రజల నివాసాలున్న 23వ డివిజన్‌లోని గవర్నర్‌పేట, సూర్యారావుపేట, ఇతర ప్రాంతాల్లో యుజిడి వ్యవస్థ, ఓపెన్ డ్రైయినేజీ వ్యవస్థ దెబ్బతిని, వీధుల్లో మురుగునీరు నిలబడి దుర్వాసన, ప్రజలు నడవలేని పరిస్థితి తయారయిందని అన్నారు. దీని వల్ల దోమలు వృద్ధి చెందుతున్నాయన్నారు. ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. స్థానిక కార్పొరేటర్‌కు చీమకుట్టినట్లుగా కూడా లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా స్థానిక కార్పొరేటర్లు, ఎంఎల్ఎ, అధికారులు స్పందించాలని కోరారు. ప్రజారోగ్యాన్ని కాపాడకుంటే ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు.



జగ్గయ్యపేట పట్టణంలోని జామియా మసీద్ (పెద్ద మసీద్)పై పిడుగు పడింది. మినార్ చంద్రవంకపై పిడుగు పడి భారీ శబ్దం రావటంతో మసీద్ కాంప్లెక్స్ ప్రాంత వాసులు ఉలిక్కిపడ్డారు. పిడుగుపడటంతో మినార్ పైభాగం స్వల్పంగా బీటలు వారింది

పిడుగు పడి రెండు గొర్రెలు మృతి



ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పిడుగు పడి రెండు గొర్రెలు మృతి చెందినట్లు గొర్రెల కాపరి పచ్చిపాల సాయి బాబు తెలిపాడు. మిగతా గొర్రెలు పిడుగు శబ్దానికి వేరువేరు ప్రాం తాలకు పారి పోయా యని, తానుకూడా తప్పించు కున్నానని చెబుతున్నాడు. కళ్ళ ముందు రెండు గొర్రెలు మృతిచెందడంతో సాయిబాబు కన్నీరుమున్నీరవుతున్నాడు.

పర్వతనేనికి నివాళి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పిఎన్ఆర్ ట్రావెల్స్ అధినేత, ప్రముఖ పారిశ్రామికవేత్త పర్వతనేని వెంకట రత్నకుమార్ మంగళ వారం గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న జనసేన జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను, సతీమణి సామినేని విమల భాను, టిడిపి జిల్లా అధ్యక్షులు నెట్టెం రఘురాం పట్టణంలోని కొత్త వెంకటేశ్వర స్వామి వారి గుడి వీధి వద్ద ఉన్న వారి స్వగృహంలో వెంకట రత్నకుమార్ భౌతిక కాయాన్ని వేరువేరుగా సందర్శించి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం జరిగిన అంతిమయాత్రలో ఉదయభాను పాల్గొన్నారు.

దళితుడికి మూత్రం తాగించడం దారుణం

ప్రజాశక్తి - వీరులపాడు : దళితులను కొట్టి నోట్లో మూత్రం పోయడం వంటి చర్యను సహించేది లేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతిలో ఇంజనీరింగ్ విద్యార్థి జేమ్స్‌ను అపహరించి, తీవ్రంగా గాయపరిచి, నోట్లో మూత్రం పోసి తాగించిన ఘటనపై ఆయన మాట్లాడారు. నిందితులందరినీ అరెస్టు చేయాలని, జేమ్స్‌ను హోం మంత్రి స్వయంగా వెళ్లి పరామర్శించాలని కోరారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - మైలవరం : పేకాట శిబిరంపై దాడి చేసి 19 మందిని బుధవారం రాత్రి అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. వివరాల ప్రకారం మండలంలోని మరుసుమల్లి గ్రామ శివారు మామిడి తోటలో పేకాడుతున్న సమాచారం మేరకు దాడి చేశామన్నారు. ఈ దాడిలో 19 మందిని అరెస్ట్ చేసి వారి నుండి రూ.91 వేల రూపాయలు నగదు, 19 సెల్‌ఫోన్‌లో స్వాధీనం చేసుకున్నామన్నారు. మరి కొంతమంది పరారైనట్లు తెలిపారు. మైలవరం, తిరువూరు, జగ్గయ్యపేట, మరుసుమల్లి, నందిగామ తదితర గ్రామాలకు చెందిన వారు ఈ పేకాట ఆడుతున్నట్లు తెలిపారు.

ముంచెత్తిన మురుగు

- వర్షానికి పొంగిన డ్రైయిన్లు
- కాల్వలను తలపిస్తోన్న రహదారులు

ప్రజాశక్తి - గన్నవరం : మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గన్నవరం మండలంలోని వివిధ గ్రామాల్లో రోడ్లన్నీ జలమయం కాగా మురుగుముంచెత్తింది. మురుగు నీళ్లతో జనాలు నానా అగచాట్లు పడ్డారు. మంగళవారం రాత్రి 12 గంటలకు మొదలైన వర్షం ఉదయం 7 గంటల వరకు ఏకదాటిగా కురిసింది. గన్నవరంలో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పా టు చేయలేదు. ఆరు కోట్ల రూపాయలు ఉంటేనే డ్రైనేజీ పనులు అవుతాయని అంచనా వేశారు. శ్రీనగర్ కాలనీ, గౌడపేట, కొత్తపేట, ముస్లింపేట, దళి తవాడ, రాయనగర్ ఏరియాల్లో ఎక్కడా డ్రైనేజీ వ్యవస్థ లేదు. బుద్ధవరం రోడ్డులో చిన్నపాటి వర్షానికే మురు గుఅంతా రోడ్డుపైకి వస్తుంది. నీరంతా దుర్వాసన కొడుతుంటే దాంట్లో నుంచి వెళ్లడానికి జనాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కేసరపల్లి, ముస్తాబాద్, సూరంపల్లి, తెంపల్లి, కొత్తగూడెం, బుద్ధవరం, దావాజి గూడెం గ్రామాల్లోనూ పక్కా డ్రైనేజీ వ్యవస్థ లేదు. వర్షం పడితే చాలుముగురు డ్రైయిన్లు పొంగి రోడ్లపైకి వ స్తున్నాయని నివాసితులు చెబుతున్నారు. పంచాయతీల్లో డ్రైయినేజీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి-గుడివాడ : మధ్యాహ్న భోజన కార్మికులకు గత నాలుగు నెలలుగా బకాయి పడిన జీతాలను తక్షణమే చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌సిపి రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద విలేకర్లతో మాట్లాడుతూ కొద్దిపాటి జీతాలతో అర్ధాకలితో జీవిస్తున్న మిడ్డే మీల్స్ కార్మికులకు జీతాలు నిలిపివేయడం భావ్యం కాదన్నారు. ఈ సమావేశంలో మిడ్డే మీల్స్ సంఘ అధ్యక్షురాలు లూర్దుమేరీ, నాయకులు లక్ష్మి పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి మొవ్వ : మణికంఠ స్వామి భజన మందిరం వారి ఆధ్వర్యంలో దాతల సహకారంతో బుధవారం కూచిపూడి, పెదపూడి సెంటర్లో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రయాణీకులు, బాటసారుల దాహార్తిని తీర్చేందుకు మూడు నెలల పాటు జరిగే ఈ కార్యక్రమం ప్రతి బుధవారం జరుగుతుందని కమిటీ వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కర్ణం సాయి, ఉగ్గెన సుబ్రహ్మణ్యం, రాయన పాండురంగారావు, చెరుకు నాగమల్లేశ్వరరావు,రామిశెట్టి రాజీవ్ ప్రసాద్ పాల్గొన్నారు.

రైల్వే ప్రాజెక్టుల నిర్మాణాలకు నిధులు మంజూరు : వెనిగండ్ల

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడలో రైల్వే గేట్ల సమస్యల శాశ్వత పరిష్కారానికి, ఎం.పి బాలశౌరి కృషితో నియోజకవర్గంలో 8 ప్రాజెక్టులకు రూ.400 కోట్ల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. బుధవారం స్థానిక ఆర్‌డివో కార్యాలయంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం, రైల్వే, నేషనల్ హైవే, రెవెన్యూ, మోర్తు శాఖల అధికారులతో ఎమ్మెల్యే వెనిగండ్ల సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు అవసరాలు, స్థానిక సానుకూలతలను దష్టిలో ఉంచుకొని నియోజక వర్గంలోని 8 గేట్ల వద్ద ఆర్.ఓ.బి మరియు ఆర్.యు.బిల నిర్మాణ ప్రాజెక్టులను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. రైల్వే గతి శక్తి పథకంలో భాగంగా రూ.400 కోట్ల నిధులతో నిర్మాణాలను చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజల భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు జరగాలని, నిర్మాణాల అనంతరం ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలని సమావేశంలో అధికార యంత్రాంగానికి ఎమ్మెల్యే రాము స్పష్టం చేశారు. గేట్ల వద్ద ఆర్ఓబి మరియు అండర్ బిడ్జిల నిర్మాణాలకు ఉన్న అనుకూలతలు రైల్వే శాఖ సీనియర్ సెక్షన్ ఇంజనీర్ శ్రీనివాసరావు తెలిపారు. ప్రాజెక్టుల నిర్మాణానికి డీపీఆర్‌ల సిద్ధం, రైల్వేలోని వివిధ శాఖల అధికారుల ప్రాజెక్టుల క్షేత్రస్థాయి పరిశీలన తదితర అంశాలను ఆయన వివరించారు. ఈ సమావేశంలో గుడివాడ డిఎస్పి వి. ధీరజ్ వినీల్, పట్టణ టిడిపి అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, ఎన్.హెచ్.ఎ. డి ఈ సత్యనారాయణ, ఏ.ఈ శరత్ చంద్ర, కన్సల్టెన్సీ సంస్థ ప్రతినిధులు నిరంజనరావు, ఆర్.అండ్.బి డి.ఇ కామేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల నిర్మాణ నమూనాలను పరిశీలిస్తున్న దృశ్యం

పాడి రైతులకు దాణా పంపిణీ

ప్రజాశక్తి-నందివాడ : మండలంలోని పశు పోషకులకు 50 శాతం రాయితీపై పశువుల దాణాను స్థానిక పశువుల ఆసుపత్రి వద్ద బుధవారం నందివాడ పశు సంవర్ధక శాఖ డాక్టర్ ఎస్. లతశ్రీ పంపిణీ చేశారు. ఈ దాణాలో 25 శాతం మాంసకత్తులు ఉంటాయని ఆమె పశు పోషకులకు వివరించారు. తెల్ల రేషన్‌కార్డు కలిగిన పశు పోషకులు 50 కిలోల దాణా 1110 రూపాయలు ఉండగా 50 శాతం రాయితీ పోను 555 రూపాయలు మాత్రమే చెల్లించాలన్నారు. మండలానికి 16.3 మెట్రిక్ టన్నుల దాణాను ప్రభుత్వం సరఫరా చేసినట్టు డాక్టర్ లతశ్రీ వెల్లడించారు. దాణా కావలసిన రైతులు రైతు భరోసా కేంద్రం, పశు వైద్య శాఖ కార్యాలయంలో నమోదు చేసుకొని వాటిని పొందాలన్నారు. 50 శాతం రాయితీపై ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన పశువుల దాణాను పశు పోషకులు సద్వినియోగ పరుచుకోవాలని మండల పశుసంవర్ధక శాఖ డాక్టర్ కోరారు. గుడివాడ మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, సిహెచ్. సీతయ్య, మూర్తి,అనిత, తొమస్ పాల్గొన్నారు.

మచిలీపట్నం టిడిపి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్నిక

ప్రజాశక్తి- మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా కాగిత వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కాటం మధుసూ దనరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం మచిలీపట్నంలోని గోల్డ్ కన్వెన్షన్ సెంటర్ లో జరిగిన మినీ మహానాడులో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర వీరిని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు.మండల పరిధిలోని చిన్నాపురం గ్రామానికి చెందిన కాగిత వెంకటేశ్వరరావు 2014-19లో మచిలీపట్నం మండల ఎంపిపిగా పనిచేసారు.పోతేపల్లి గ్రామానికి చెందిన కాటం మధుసూదనరావు గతంలో గ్రామ సర్పంచ్ గా పనిచేసారు.ఈ సందర్భంగా వీరికి పలువురు ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

నగర టీడీపీ అధ్యక్షునిగా లోగిశెట్టి స్వామి

ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా) : మచిలీపట్నం నగర టీడీపీ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు లోగిశెట్టి స్వామి, బచ్చుల అనిల్ నియమితు లయ్యారు. బుధవారం స్థానిక గోల్డ్ కన్వెన్సెన్ హాలులో నిర్వహించిన మినీ మహానాడులోమంత్రి కొల్లు రవీంద్ర విరిరువురిని ప్రకటించారు.

ప్రజాసమస్యలను పట్టించుకోని ప్రభుత్వం : మల్లాది

మాట్లాడుతున్న మల్లాది విష్ణు

ప్రజాశక్తి-అవనిగడ్డ : కోర్టులు చెబుతున్నా, మొట్టికాయలు వేస్తున్న కూటమి ప్రభుత్వం పాలకులు తమ బుద్ధి మాత్రం మార్చుకోవడం లేదని విజయవాడ మాజీ శాసనసభ్యుడు మల్లాది విష్ణు విమర్శించారు. బుధవారం అవనిగడ్డ మాజీ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు స్వగహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కరెంటు రూ 2.40కి కొనుగోలు చేస్తూ విద్యుత్ ఒప్పందం కుదుర్చుకుంటే ఇప్పుడున్న కూటమి పార్టీలు నానా యాగి చేశాయన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అదే కరెంటుని రూ 4.60కు ఎలా కొనుగోలు చేస్తూ ఒప్పందం కుదుర్చుకుందన్నారు. దీనిపై ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఏపీలో ధాన్యాకారంగా పేరుందిన జిల్లాలో రైతులు పండించిన పంటలను కొనుగోలు చేసే వారే లేరు అన్నారు. పండించిన ధాన్యం కు కొనుగోలు చేయకపో వడం వల్ల రోడ్లపై ఆరబోసి తీవ్ర ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. గతంలో వైఎస్ఆర్సిపి ప్రభుత్వం బస్తా ధాన్యాన్ని కళ్ళల్లోనే రూ 2200కు కొనుగోలు చేస్తే నేటి ప్రభుత్వం రూ 1600 కు కొనుగోలు చేస్తుందన్నారు. టమాట చెరుకు మిర్చి పొగాకు ఇలా ఏ పంట చూసినా మద్దతు ధర లేక కొనేవారు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని మల్లాది విష్ణు విమర్శించారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడం కారణమని తెలుపుతూ క్యాబినెట్ మీటింగ్ లో గిట్టుబాటు ధర కల్పించేందుకు కమిటీ వేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాగా రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాలని ఆరోపించారు. చట్టాలను రాజ్యాంగాన్ని కూటమి ప్రభుత్వం చేతిలోకి తీసుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఏమి చేయకుండా ఇప్పుడు సంక్షేమ కార్యక్రమాలు ఇస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ చార్జీలతో పాటు నిత్యవసర వస్తువులు నీటి పన్నులు ఆస్తి పన్ను అన్ని రకాల పన్నులు పెంచేసి ప్రజల నడ్డి విరుస్తోందని, ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పి నూటికి 30 మంది కూడా ఇవ్వలేదన్నారు. ప్రజాసమస్యలను పట్టించుకోని కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, వైసీపీ నాయకులు రాజనాల మాణిక్యాలరావు, గరికపాటి కష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సు సర్వీసు

ప్రజాశక్తి-అవనిగడ్డ : తెలంగాణలోని కాళేశ్వరం పుణ్యక్షేత్రం వద్ద జరుగుతున్న సరస్వతి నది పుష్కరాలకు అవనిగడ్డ ఆర్టీసీ డిపో నుండి మరో ప్రత్యేక స్పెషల్ బస్సు సర్వీసును నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కే హనుమంతరావు తెలిపారు. ఈ బస్సు ఈనెల 24వ తేదీ రాత్రి 8 గంటలకు అవనిగడ్డలో బయలుదేరి ఉదయం కాలేశ్వరం చేరుకుంటుందని అన్నారు. అక్కడ సరస్వతి నది పుష్కర స్నానం ఆచరించి కాలేశ్వరుని దర్శనం అనంతరం రామప్ప దేవాలయం వరంగల్ నగరంలోని 1000 స్తంభాల గుడి, భద్రకాళి దేవాలయం దర్శించుకుని 26వ తేదీ ఉదయం అవనిగడ్డకు చేరుతుందని తెలిపారు. భక్తులు తక్షణమే రిజర్వేషన్ చేయించుకోవాల్సిందిగా కోరారు. ఈ యాత్ర బస్సుకు ఛార్జి ఒక్కొక్కరికి రూ రెండు వేల రూపాయలు కాగా నిర్ణయించినట్లు తెలిపారు. ఇతర వివరాల కోసం 9199 63658630,703633 5079 నెంబర్లను సంప్రదించాలన్నారు.

భావ ప్రకటన స్వేచ్ఛను హరించటం సిగ్గుచేటు

ప్రజాశక్తి-గుడివాడ : బిజెపి నాయకత్వంలోని కేంద్రప్రభుత్వం, పార్టీ పాలిత రాష్ట్రప్రభుత్వాలు భావ ప్రకటనా స్వేచ్ఛను హరించే ప్రయత్నాలు చేస్తున్నాయని సాహితీ స్రవంతి అధ్యక్షులు సురేంద్ర, ఐద్వా ప్రధాన కార్యదర్శి పి.రజనిలు విమర్శించారు. బుధవారం స్థానిక కామ్రేడ్ సుందరయ్యభవన్‌లో ఏర్పాటు చేసినవిలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల మహారాష్ట్రలోని ముంబయిలో నటుడు, వీరసత్‌దార్ జ్ఞాపకార్థం జరిగిన కార్యక్రమంలో, ప్రఖ్యాత కవి ఫైజ్ అహ్మద్ ఫైజ్ కవిత "హమ్దేఖేంగే"ను గానం చేసిన యువసాంస్కృతిక బందంపై భారత న్యాయ సంహిత సెక్షను 152(రాజ ద్రోహం)ˉసెక్షన్196 (గ్రూపుల మధ్య శతత్వాన్ని పెంచటం) సెక్షన్353(ప్రజలు దుశ్శర్యకు దోహదపడే ప్రకటన చేయటం) కేసులు పెట్టటం భావప్రకటనా స్వేచ్ఛను హరించటమేనన్నారు. తక్షణమే ఈ కేసులను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. సాహితీసంస్థలు, ప్రజాస్వామికవాదులు, మహారాష్ట్ర ప్రభుత్వ దుశ్శర్యను ముక్తకంఠంతో ఖండించాలని వారు కోరారు. విజ్ఞప్తి చేశారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి : మంత్రి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.బుధవారం నగరంలోని 38వ వార్డులో 80 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న పట్టణ ఆరోగ్య కేంద్రం భవనానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ ఆరోగ్య కేంద్రం నిర్మాణం చేపట్టామని, ఈ కేంద్రం నిర్మాణం పూర్తయితే ఇక్కడ పరిసర ప్రాంతాల్లోని ప్రతి కుటుంబానికి ముఖ్యంగా డయాలసిస్ రోగులకు చాలా ఉపయోగపడుతుందన్నారు. మచిలీపట్నంలోని వైద్య కళాశాల అనుసంధానంగా ఆసుపత్రి నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నామన్నారు. వైద్య కళాశాలలో ఫిజికల్ ఫిట్నెస్ కేంద్రం ఏర్పాటుకు 12 కోట్ల రూపాయల వ్యయంతో టెండర్లు పిలిచామని త్వరలో పనులు మొదలవుతాయన్నారు. ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, డిఎంహెచ్ ఓ డాక్టర్ శర్మిష్ట, మునిసిపల్ డి. ఈ. కుబియా నాయక్, ఏఈ రాజేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న లక్ష్మణరావు

స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

బివివి కేంద్రానికి లక్ష్మణరావు విరాళం

ప్రజాశక్తి - వత్సవాయి : సమాజానికి ఎంతగానో ఉపయోగపడే ఇటువంటి విజ్ఞాన్ కేంద్రాలు ఉండాలని మాజీ ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. బొగ్గవరపు వెంకటేశ్వర్లు విజ్ఞాన కేంద్రానికి తమ వంతుగా 25 వేల రూపాయల విరాళం ఆయన బుధవారం ప్రకటించారు. ఈ సందర్భంగా బివివికె, యుటిఎఫ్, డివైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ సంయుక్త ఆధ్వర్యంలో డిఎస్‌సి అభ్యర్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లక్ష్మణరావుతో పాటు పోటీ పరీక్షల నిపుణులు హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు ఆధ్వర్యంలో ముద్రించిన విద్యా మనో విజ్ఞాన శాస్త్రం, లెక్కలు స్టడీ మెటీరియల్ ఆవిష్కరించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ డిఎస్‌సి పరీక్షలో ఉత్తీర్ణులు కావాలంటే, ఇష్టపడి చదివి విషయ పరిజ్ఞానాన్ని పెంచుకుని పరీక్షలకు హాజరు కావాలని అభ్యర్థులకు సూచించారు. ఆయన భారత రాజ్యాంగం, కరెంట్ అఫైర్స్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ సిహెచ్.హనుమంతరావు ట్రస్టు సభ్యులు బి.వెంకటరాజారావు, బి.రాము, యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.కృష్ణయ్య యుటిఎఫ్ నాయకులు సుధానంద్, హుస్సేన్, సుబ్రహ్మణ్యేశ్వరావు, ప్రైమర్ నరసింహారావు, డివైఎఫ్‌ఐ నాయకులు వై.కిషోర్, కోటయ్య, అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

చందర్లపాడు విలేకరికి అస్వస్థత

మాజీ ఎంఎల్‌ఎ రూ.50 వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి- నందిగామ : చందర్లపాడు ప్రజాశక్తి విలేకరి అరిగెల శ్రీనివాసరావుకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో విజయవాడలోని విజయ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్నారు. బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కాలు, చేయి పని చేయకపోవడంతో నడవలేనిస్థితిలో ఉన్నారు. స్టంట్ వేయాల్సి రావడంతో సుమారు రెండు లక్షల రూపాయలకు పైగా ఖర్చవుతుందని కుటుంబ సభ్యులు తెలుపుతున్నారు. గతంలో కూడా శ్రీనివాసరావుకు గుండె పోటు రావడంతో స్టంట్ వేశారు. మంగళగిరి మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి స్పందించి రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. జర్నలిస్టు సంఘాల నాయకులు పఠాన్ మీరా హుస్సేన్, ఎవి.నారాయణ, లాల్ అహమ్మద్ గౌస్, రవి శేఖర్ తదితరులు రామకృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. దాతలు సాయం అందించేందుకు ముందుకు రాగలరని (ఫోన్ పే నెంబర్ 95421 09797) బాధిత కుటుంబం, యూనియన్ నాయకులు కోరుతున్నారు.

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - మైలవరం : వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు బుధవారం ఎల్‌హెచ్‌ఆర్ స్కూల్ ఉపాధ్యాయులు బిఎస్‌సి బోస్ భారతదేశంలో ప్రవహించే నదులు వాటి జన్మస్థలాలు అనే అంశం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాఠకులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమాల ఏర్పాటుకు కృషి

వృద్ధుల సంక్షేమ శాఖ రాష్ట్ర సంచాలకులు రవి ప్రకాష్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : రాష్ట్ర వ్యాపితంగా అన్ని జిల్లాల్లో వద్ధాశ్రమాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని వృద్ధుల , విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సంచాలకులు బి రవి ప్రకాష్ రెడ్డి తెలిపారు. ప్రతి నెలా ఇస్తున్న వద్ధాప్య పింఛన్ వల్ల రాష్ట్రంలో లక్షల మంది పెద్దవాళ్ళు సంతోషంగా జీవిస్తూ ఉన్నారని అన్నారు. హెరిటేజ్ ఫౌండేషన్ వారి ఆద్వర్యంలో వృద్ధాశ్రమాలు, హోమ్ కేర్ నిర్వాహకులు సుపర్ వైజర్లు, మేనేజర్లు, సంరక్షకుల శిక్షణా తరగతులు స్థానిక స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో బుధవారం ఆయన ముఖ్య వక్తగా పాల్గొని లాంఛనంగా ప్రారంభించారు. వారానికి రెండు రోజుల పాటు దాదాపు 12 రోజులు జరుగనున్నాయి. ఉమ్మడి కృష్ణాజిల్లా నుండి 25 మంది వృద్ధాశ్రమం నిర్వాహకులు పాల్గొన్నారు. రవి ప్రకాష్ మాట్లాడుతూ జీవితంలో అనేక అనుభవాలు ఉన్న వృద్ధుల సలహాలు నేటితరం స్వీకరించాలని సూచించారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కౌన్సిల్ సమావేశంలో వచ్చిన సూచనలు మేరకు అరవై ఏళ్ళు పై బడిన వారందరికీ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు కార్డులు స్థానిక సచివాలయాల ద్వారా అందజేస్తున్నారని, డెబ్బై ఏళ్లు పై బడిన వారికి ఆయుష్మాన్ భారత్ కార్డులు ఇస్తున్నారని దీని ద్వారా ఆరోగ్య బీమా పొందవచ్చుని అన్నారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ స్థానంలో చిన్న చిన్న కుటుంబాలు వచ్చాయని జనాభాలో వృద్ధులు 19 శాతం ఉన్నారని రాబోయే పదేళ్ళలో మరింత పెరిగే అవకాశం ఉందని అన్నారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ శిక్షణా తరగతుల ఆవశ్యకతను వివరించారు. వాసవ్య మహిళా మండలి అధ్యక్షులు బొల్లినేని కీర్తి మాట్లాడుతూ ప్రైవేట్ వారి ఆద్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమాలకు పన్నులు రాయితీలు ఇవ్వాలని కోరారు. హెరిటేజ్ ఫౌండేషన్ ప్రతినిధి టి రవి మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఉన్న వారికి సేవ చేయడం ఎంతో అనుభూతిని ఇస్తుందని అన్నారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు వేమూరు బాబురావు అధ్యక్షత వహించగా సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచాలకులు కామరాజు తగు సలహాలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నాదెళ్ల సుమతీ దేవి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రవి ప్రకాష్

దేవస్థానంలో వివిధ విభాగాల పరిశీలన

ప్రజాశక్తి - వన్ టౌన్ : శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానంలో కీలకమైన, భక్తులతో అనుసంధానమైన విభాగాలను ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె.శీనానాయక్ బుధవారం పరిశీలించారు. మొదటగా భక్తుల చెప్పుల స్టాండు, మొబైల్, లగేజ్ భద్రపరిచే కౌంటర్లు పరిశీలించారు. అధిక ధరలు ఏమైనా వసూలు చేస్తున్నారా అనేది యాత్రికుల అభిప్రాయం తెలుసుకున్నారు. దేవస్థానం ఉచితంగా చెప్పులు భద్ర పరుస్తున్నా ఎక్కడికక్కడ చెప్పుల గుట్టలు ఉండటం గమనించి, మైక్ ప్రచారం చేయవలసినదిగా ఆదేశించారు. ఘాట్ రోడ్‌లో గల దుకాణాలు పరిశీలించి ఎం.ఆర్.పి ధరలకే విక్రయించాలని, యాత్రికులతో గౌరవంగా మెలగకపోతే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రొటోకాల్ ఆఫీస్ వరకు వాహనాలు వస్తుండటం అటు ఆలయం భద్రతకు ఇటు సామాన్య యాత్రికులకు ఇబ్బంది కాబట్టి జాగ్రత్తలు వహించాలని ప్రోటోకాల్ పర్యవేక్షకులు లక్ష్మణ్‌కు సూచించారు. ప్రొటోకాల్ దర్శనాలు నమోదు గురించి తెలుసుకున్నారు. రూ.500 టికెట్ బుకింగ్ కౌంటర్ పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలో ప్లాస్టిక్ వాడకం ఎక్కువ అయిందని, దేవస్థానంలో ప్రసాదాలకు ఇతర అవసరాలకు ప్లాస్టికేతర సంచులు వాడుతుండగా, కొండ దిగువున వీధి వ్యాపారులు ఇస్తున్న సంచులు ఇంద్రకీలాద్రిపై భారం అవుతున్నాయని ఇఒ శీనానాయక్ అభిప్రాయపడ్డారు. ఇంద్రకీలాద్రిపై ప్లాస్టిక్ వాడకం తగ్గించడానికి యాత్రికులు, వ్యాపారులు, సిబ్బంది సహకరించాలని కోరారు. దేవస్థానంలో పొడి చెత్త, తడి చెత్త వేరు చేస్తున్న విధానం గమనించారు. అనంతరం ఉచిత దర్శనం క్యూ లైను నుండి ఆలయంలోకి ప్రవేశించి దర్శనం చేసుకున్నారు. ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తూర్పు నియోజకవర్గంలో టిడిపి మినీ మహానాడు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : తూర్పు నియోజకవర్గాన్ని టిడిపికి కంచుకోటగా మార్చిన ఘనత హ్యాట్రిక్ ఎంఎల్‌ఎ గద్దె రామ్మోహన్‌దేనని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, టిడిపి జిల్లా అధ్యక్షుడు నెట్టం రఘురామ్ అన్నారు. తూర్పు నియోజకవర్గ మినీ మహానాడు బుధవారం కన్నుల పండువగా జరిగింది. నియోజకవర్గంలోని బెంజ్‌సర్కిల్ దగ్గర ఉన్న జ్యోతి కన్వెన్షన్ హాలులో నిర్వహించిన మినీ మహానాడుకు ఎంఎల్‌ఎ గద్దె అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగాఎంపి మాట్లాడుతూ నియోజకవర్గంలోని డివిజన్లలో ప్రతి రోజూ పర్యటిస్తూ పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందచేయడమే కాకుండా తన సొంత నిధులతో పేదలకు ఆర్థిక సహాయాలను అందజేస్తున్న ఏకైక ఎమ్మెల్యే గద్దె అన్నారు. గద్దెను చూసి తాను స్ఫూర్తి పొందుతున్నానన్నారు. ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానికంగా ఉన్న అంశాలను చర్చించుకుని తీర్మానాలు చేసి పార్టీని మరింతగా ముందుకు తీసుకువెళ్లేందుకు మహానాడు కార్యక్రమం దోహదం చేస్తోందన్నారు. కేశినేని శివనాథ్‌ను ఎంపిగా, ఎంఎల్‌ఎగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించిన పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ మాట్లాడుతూ మహానాడు అంటే తెలుగుదేశం పండుగ అన్నారు. టిడిపిని స్థాపించిన నాటి నుంచి ప్రతి ఏడాది క్రమం తప్పకుండా మహానాడును నిర్వహించుకుంటున్నామని చెప్పారు. స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ ఎంఎల్‌ఎ గద్దె రామమోహన్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే అన్నారు. నిత్యం ప్రజల మధ్యన ఉండే అతికొద్ది మంది ఎమ్మెల్యేల్లో గద్దె రామ్మోహన్ ఒకరన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శాలివాహన, కుమ్మరి కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్, మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు బొప్పన భవకుమార్, షేక్ ఫిరోజ్, గన్నె ప్రసాద్, చెన్నుపాటి గాంధీ, ఉడా మాజీ చైర్మన్ తూమాటి ప్రేమ్‌నాథ్, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు షేక్ నాగూర్, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి ఉషారాణి, జిల్లా ఎస్‌సి విభాగం అధ్యక్షుడు సొంగా సంజయ్‌వర్మ పాటు నియోజకవర్గంలోని పార్టీ డివిజన్ అధ్యక్షులు, కార్యదర్శులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, అధిక సంఖ్యలో పార్టీ డివిజన్ నాయకులు, కార్యకర్తలు హజరయ్యారు. పార్టీ కోసం కృషి చేసి మరణించిన పార్టీ నాయకులు, కార్యకర్తలను నివాళులర్పించారు.

మాట్లాడుతున్న ఎంపి కేశినేని శివనాథ్

హార్పిక్ డ్రైన్ నూతన ఉత్పత్తుల ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రముఖ అంతర్జాతీయ వినియోగదారు ఆరోగ్యం, పరిశుభ్రతా కంపెనీ రెకిట్, సరికొత్త హార్పిక్ డ్రైన్ ఎక్స్‌పర్ట్స్‌తో తమ డ్రైన్ క్లీనర్ ఉత్పత్తులను తీసుకు వస్తున్నామని సంస్థ మార్కెటింగ్ డైరెక్టర్ గౌతం రిషి తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో నూతన ఉత్పత్తుల ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నవీన ఉత్పత్తి కేవలం 15 నిమిషాల్లో కిచెన్ డ్రైన్స్ అడ్డంకులను తొలగించేలా అత్యంత వేగవంతమైన డ్రైన్ క్లీనర్‌తో వినియోగదారులకు కేటాయిస్తుందన్నారు. ఈ ఉత్పత్తి అత్యంత కఠినమైన కిచెన్ క్లాగ్స్‌కు కూడా వేగవంతమైన, సమర్థవంతమైన పరిష్కారాన్ని అందిస్తుందన్నారు. రోజూవారీ జీవితాన్ని సులభతరం చేసి, పరిశుభ్రతా ప్రమాణాలను మెరుగుపరిచే ఉన్నతమైన ఉత్పత్తులను అందిస్తుందన్నారు.

గ్రీన్ టాక్స్ తగ్గింపుతో లారీ యాజమానుల హర్షం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : మినీ ట్రాన్స్ పోర్ట్ యజమానులకు, డ్రైవర్లకు భారంగా మారిన గ్రీన్ టాక్స్ తగ్గింపుతో ట్రాన్స్ పోర్ట్ యాజమానులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం డాక్టర్ ఎన్‌టిటిపిఎస్ టిప్పర్ లారీ ఓనర్స్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం కేక్‌కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మైలవరం శాసనసభ్యులు వసంత వెంకటకృష్ణ ప్రసాద్‌కు ధన్యవాదాలు తెలుపుతూ వారి చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో గ్రీన్ టాక్స్ సుమారు రూ.18 వేలు ఉండేదని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ట్రాన్స్ పోర్టు వాహన యజమానుల విజ్ఞప్తి మేరకు రూ.3 వేలకు తగ్గించారన్నారు.

'వి'నూత్న ప్రచారం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :
ప్రముఖ టెలికం సంస్థ వి 2024-25 ఆర్థిక సంవత్సరం ఆరు నెలల వ్యవధిలోనే లక్షకు పైగా టవర్లను ఏర్పాటు చేసిన మైలురాయిని అధిగమించిన సందర్భంగా తమ కొత్త ప్రచార కార్యక్రమాన్ని ఆవిష్కరించినట్లు సంస్థ ప్రతినిధి ఎం.రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. నెట్‌వర్క్ మౌలిక సదుపాయాలను భారీ స్థాయిలో వేగవంతంగా విస్తరించడం, పటిష్టపర్చుకోవడంలో 'వి' నిబద్ధతకు ఇది నిదర్శనంగా నిలుస్తుందని అన్నారు. నెట్‌వర్క్‌ను పటిష్టపర్చుకున్న విషయాన్ని సరికొత్తగా, ఆకట్టుకునేలా తెలియజేసే దిశగా సరికొత్త నెట్‌వర్క్ అవతార్‌లు ది నెట్టీస్‌తో 'వి' క్యాంపెయిన్ రూపొందిందని తెలిపారు. మొబైల్ టవర్స్ స్ఫూర్తితో యానిమేటెడ్ క్యారెక్టర్లు ఇందులో ఉంటాయన్నారు. ఐపిఎల్ సందడి నెలకొన్న సందర్భంగా ఈ సీజన్‌లో అత్యుత్తమ ప్లేయర్లతో అత్యంత బలమైన టీమ్‌ను ప్రతిబింబంచేలా ఈ అవతార్‌ల జట్టు ఉంటుందని తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.